# అందెల కథ

**(శిలప్పదికారం )**

**తమిళ మూలం: సంగం సాహిత్యం - ఇలంగో అడిగళ్**

**తెలుగు స్వేచ్ఛానువాదం: కె. నాగరాజన్ (2023)**

**email: knr_sh@yahoo.com**
**website: http://taoofeverything.in/**

# Acknowledgements

**Special thanks** to my daughters Samragni and Manogna and my best friend and my children's mother Rashmi for their support and encouragement through-out all my translation adventures, starting with **Ponniyin Selvan.**

Nagarajan

## ముందుమాట

తమిళసాహిత్యంలో అత్యంత పురాతనమైన (సుమారు రెండువేల ఏళ్ళ పైబడ్డ), అత్యంత ప్రాచుర్యం కల గ్రంధాలలో 'శిలప్పదికారం' ఒకటి. ఇది కోవలన్- కన్నగి కథ. తమిళనాడులో కథానాయిక కన్నగిని దేవతగా పరిగణించి పూజిస్తారు. ఆమె సత్యసంధత, వాక్మహిమ అంతటివి మరి.

ఈ కథ చాల పురాతనమైనది కావడం వల్ల తమిళ సాహిత్యకారులు, పండితులు చాల పరిశోధన చేసి మూల సాహిత్యాన్ని కొంతవరకు సేకరించి సమీకరించారు.

ఈ శిలప్పదికారం (శిలప్పు + అదికారం= అందె కథ) ద్రవిడ సాహిత్యంలో శిరోరత్నమని చెప్పదగిన మహాకావ్యం. ఇందులో కథకన్న ఆ కాలపు సంగీత నాట్య, నటన కళలకు ఎక్కువ ప్రాముఖ్యత ఇవ్వబడింది. మూలకావ్యంలో ఆ కళలకు ఇచ్చిన ప్రాధాన్యతను ఈ అనువాదంలో సాధ్యమైనంతవరకు తెనిగించడమైంది.

ఈ అనువాదాన్ని తమిళ మూలకథ, ఇంకా స్వేచ్ఛగా లభ్యమవుతున్న తెలుగు, తమిళ, ఆంగ్ల పుస్తకాల ఆధారంగా, ఒక స్వేచ్ఛానువాదంగా చేయడమైంది. కాబట్టి ఎటువంటి copyright సమస్యలు లేవు.

ఇట్లు,
కె నాగరాజన్,
అనువాదకుడు

**కథాంశం**

కోవలన్-కన్నగి వివాహం, పెద్దలు వారిని గృహస్థులుగా వేరొక ఇంట ఉంచడం, నృత్యమయూరి మాధవి రంగప్రవేశం, సాయంసమయ విశేషాలు, ఇంద్రోత్సవాలు, సముద్రస్నానాలు , మాధవి-కోవలుల ప్రణయం, ఆటపాటలు, తరువాత వారి వియోగం, కన్నగి దుస్స్వప్నం, దేశక్షేత్ర సందర్శనం, మదురై సమీపాన ఒక ఊళ్ళో కోవలన్, కన్నగి విడిది చేయడం, కోవలన్ కొత్త జీవితం ప్రారంభించేందుకు కన్నగి ఇచ్చిన అందెతో మదురై వణిజ వీధికి వెళ్ళడం, విధివశాత్తు రాజభటుల చేత రాజపత్ని అందెను దొంగిలించిన చోరుడని బంధించబడి వధించబడడం, అది తెలియవచ్చిన కన్నగి కన్నీరు మున్నీరై మదురై రాజు పాండ్యుని సభలో ప్రవేశించి న్యాయవాదం చేయడం, రాజపత్నిని చూసి ప్రతిజ్ఞ చేయడం, కన్నగి తన స్తనజాగ్నితో మదురైని దహించడం, నగరాధిదేవత పూర్వకథను వినిపించడం, కొరవరాజు పర్వతాన్ని దర్శించడం, చేరరాజు కన్నగి శిలాప్రతిమను చెక్కించడం, గంగాజల స్థాపనం, ప్రతిష్ట, స్తుతి మొదలైన ముప్పై విషయాలను గద్యపద్యమయంగా యువరాజస్వామి (ఇలంగో అడిగళ్) రచించి చదువగా, మదురై నగరవాసియైన వణిజుడు శాస్త విన్నాడు.

ఇది కథ సారాంశం.

~~~
~~~

## మహిమావ్యాప్తి

ఒకయేడు పాండ్యరాజ్యంలో వానలు కురవక రాజ్యమంతా కరవుకు గుఱై ప్రజలందరూ ఆకలి దప్పులతో అలమటించసాగారు. అప్పుడు పాండ్యరాజ వంశజుడు, హోమ శాంతిక్రియలు చేసి పత్నిదేవతకు[1]ఉత్సవాలు జరిపించాడు. మళ్ళీ వానలు కురిసాయి. వ్యాధులంతరించాయి. దేశం మళ్ళీ సుభిక్షమైంది.

అది విని కొంగుదేశ[2]యువరాజులు తమ దేశంలో కూడ పత్నిదేవతకు ఉత్సవాలు జరిపించగా, వానలు కురిసి కొంగునాడు సస్యశ్యామలమైంది.

ఈ విశేషం తెలియవచ్చిన లంకరాజు గజబాహు కూడ దేవాలయాలు , వాటి ముందు బలిపీఠాలు నిర్మించి దేశమంతటా ఉత్సవాలు జరిపించగా ఆ దేశంలో కూడ వర్షాలు సమృద్ధిగా కురిసి ఆ దేశం కూడ సుభిక్షమైంది.

ఈ అద్భుతవార్త చోళదేశాన్ని కూడ చేరగా అప్పటి చోళరాజైన పెరుంగిళ్ళి తమ రాజధాని నగరమైన ఉఱైయూరు నగరదేవతే పత్నిదేవత కాబట్టి మహాసంతోషంతో చోళరాజ్యమంతటా దేవాలయాలు కట్టించి నిత్యోత్సవ పూజలు జరిపించసాగాడు.

ఇది కన్నగి మహిమ.

---

1 ఈ పత్నిదేవత మారియమ్మ (వానల దేవత) అన్న పేరుతో దక్షిణదేశమంతటా కొనియాడబడుతూంది. తెలుగు దేశంలో కూడ చోళుల కాలంలో కన్నగి దేవాలయాలు కట్టబడ్డాయని, అవి కనకమహాలక్ష్మి, కనకదుర్గ దేవాలయాలనే పేర్లతో పేరుగాంచాయని కొందరు చరిత్రకారుల అభిప్రాయం.

2 కొంగుదేశం ఇప్పటి కొయంబత్తూరు, సేలం జిల్లాలలో కొంతభాగం.

# అందెల కథ

## మొదటి భాగం

### *పుహార్ కాండమ్*

## స్తుతి

సుభిక్షమైన చోళరాజ్యంలో సముద్రతీరాన పుహార్ అనే ఒక అందమైన పట్టణముండేది. ఆ పట్టణంలో గుణాఢ్యుడనే ఒక పెద్ద వర్తకుడు, అతనికి కోవలన్ అనే ఒక సకల సద్గుణ సంపన్నుడైన కుమారుడు. అదే పట్టణంలో ఒక మహానావికునికి కన్నగి అనే పన్నెండేళ్ల అందాల బొమ్మ వంటి కుమార్తె ఉండేది.

ఈ కోవలన్, కన్నగి తలిదండ్రులు వీరిద్దరికి ఈడు-జోడు సరిగ్గా కుదురుతుందని ఎంచి వారిద్దరికి వివాహం చేయ నిశ్చయిస్తారు. వియ్యంకులిద్దరూ సిరిసంపదల్లోను, దానగుణంలోను సుసంపన్నులు కావడం చేత ఏనుగుల మీద ఊరేగింపులు, సన్నాయి మేళాలు మొదలైన పెళ్ళి వేడుకలతో పట్టణమంతా చాల కోలాహలంగా కానవచ్చింది. పెళ్ళిపందిళ్ళను ముత్యాలు, రత్నాలు, మణుల తోరణాలతో అలంకరించారు. పెళ్ళి పీటలేమో బంగారపు పీటలు! వృద్ధ పురోహితుడు వేద శాస్త్రోక్తంగా పెళ్ళి కార్యాలు జరిపించగా కోవలన్ కన్నగిని అగ్నిసాక్షిగా వివాహం చేసుకొన్నాడు. విచ్చేసిన బంధుమిత్రులు, పురజనులు చాల సంతసించి వధూవరులను చిరకాలం సుఖంగా జీవించాలని మనసార దీవించారు. ప్రౌఢవనితలు వారిద్దరిని చక్కగా అలంకరించి శయనగృహానికి పంపి తమ తమ ఇళ్ళకు మరలి వెళ్ళారు. పుహార్ పట్టణవైభవాన్ని మాత్రమేగాక [3]మంచుకొండ మీద వ్యాఘ్రపతాకాన్ని ఎగురవేసిన చోళరాజ్య వైభవాన్ని కూడ చాటి చెప్పేలాగ ఘనంగా జరిగిందా వివాహం.

~~~

3 హిమాలయం
~~~

## గృహస్థ ధర్మం

సారవంతమైన భూములు, సమృద్ధంగా వర్షాలు, అందు ఫలితంగా సమృద్ధంగా పాడిపంటలు, సుఖసంతోషాలతో ప్రజలు, సన్మార్గులైన రాజుల అండతో ధర్మపథంలో వ్యాపారం చేసి గడించిన సిరిసంపదలను పాత్రులకు దానధర్మాలు చేసే వర్తకులతో పేరుగాంచిందా పుహార్ పట్టణం. కావేరి నది సముద్రంలో కలిసేచోట ఆ నది తీరాన ఉండడం వల్ల ఆ పట్టణానికి ఇంకొక పేరు కావేరిపట్టణం.

అటువంటి పట్టణంలో మయుడే నిర్మించాడా అన్నట్లు మిరుమిట్లుగొలిపే ఒక ఏడంతస్తుల మేడలో కోవలన్ తన అందాల భరిణెలాంటి ప్రియపత్ని కన్నగితో అన్ని సుఖభోగాలతో - చక్కని పరిమళభరిత ఉద్యానవనం, ఆ ఉద్యానవనంలో విహారం - హాయిగా సంసారం చేయసాగాడు.

కోవలన్ తనకు కన్నగిపైనున్న ప్రేమను పలువిధాలుగా ప్రదర్శించేవాడు - అప్పుడప్పుడు ఆమె అందచందాలను పొగడి మైమరపించడం, ఆమెతో సరససల్లాపాలాడడం , ఆమె సహజ సౌందర్యం అలంకారాలతో మరింత ఇనుమడించగా తాను చూసి ఆనందించడం, ఆమె సంగీత, నాట్యకళలను ప్రతినిత్యం కనులారగాంచి మైమరచిపోవడం .

ఇదంతా చాల బాగుంది సరే, గృహస్థుడైన తర్వాత కొన్ని గృహస్థధర్మాలను పాటించాలని బోధించింది ఒకరోజు కోవలన్ తల్లి. అతిథులను ఆహ్వానించి తగిన ఉపచారాలు చేయడం, పురజనులతో చక్కగా మసలుకోవడం, దానధర్మాలు చేయడం, దాసదాసీజనాలను ప్రేమతో చూసుకోవడం, ఇలా గృహస్థధర్మాలను కోవలన్ తల్లి అతనికి బోధించగా కోవలన్, కన్నగి ఆవిధంగానే నడుచుకొంటూ, రతీమన్మధుల్లాల దాంపత్యసుఖాన్ని కూడ తనివిదీర తనుభవించసాగారు .

~~~
~~~

## రంగప్రవేశం

[దేవకన్య ఊర్వశి ఇహలోకంలో మాధవిగా అవతరించిందని మూలరచయిత ఉవాచ.]

మాధవి మహా సౌందర్యవతి, నృత్యసంగీత కళల్లో సాటిలేని మేటి అని అతిచిన్న వయసులోనే పేరుగాంచింది. అయిదవయేట కాలికి అందెలు కట్టుకొని నాట్యం నేర్చుకోవడం మొదలు పెట్టి, పన్నెండేళ్ళ వయసుకే రాజాస్థానంలో నాట్యమాడేందుకు ఆహ్వానించబడిందట.

ఆమెకు పాఠాలు నేర్పిన నాట్యాచార్యులు, సంగీతాచార్యులు, కవి పండితులు, వైణికులు, వేణువాదకులు తమ తమ క్షేత్రాల్లో దిట్టలు.

**నాట్యాచార్యులు** : జైత్ర (రాజులు చూసే నాట్యం), జాతీయ (సాధారణ పురప్రజల ముందు ప్రదర్శించే నాట్యం) నాట్యాలలో నిష్ణాతులై, వివిధ నాట్యగ్రంథాలను క్షుణ్ణంగా చదివి అర్థం చేసుకొని, నృత్తం, నృత్యం, అభినయం, తాళం - వీటన్నిటి లక్షణాలను చక్కగా అర్థం చేసుకొన్న ఉద్దండులు.

**సంగీతాచార్యులు** : వీణావాద్యం, వేణుగానం నేర్చి, భావ-రాగ-తాళ-స్వరగతుల సూక్ష్మాలను సమగ్రంగా నేర్చిన పండితులు, గానకళలోను నిష్ణాతులు. దానికి తోడు దేశభాషల్లో పాండిత్యాన్ని గడించి తమ సంగీత నాట్యకళల్లో ఆ పాండిత్యాన్ని మిళితం చేసి అందరి అభినందనలందుకొన్న మేటి విద్వాంసులు.

**కవి :** జాతీయ, జైత్ర పద్ధతుల తీరుతెన్నులు, వ్యత్యాసాలు క్షుణ్ణంగా అర్థం చేసుకొని, ఛందోబద్ధ కవిత్వ రచనలోను, సాధారణ జనులకు అర్థమయ్యే సరళ కవిత్వ రచనలోను ఆరితేరిన కవి ప్రవరులు.

**మేళకర్త :** ఆట, పాట, ఆటకు తగిన భాష, సంగీత పద్ధతులకు అనుగుణంగా తాళం వేస్తూ, వీణావాదం, వేణుగానం విననింపుగా కలిగించి సరదాగాను, చేతి సైగలతోను శ్రుతిసంగతులను మెళకువతో సభ్యులకు తెలియజేయగల సునిశిత విద్వాంసులు.

**వైణుకుడు (వేణువు వాయించు విద్వాంసుడు ):** అతిరమ్యమైన పాటల స్వరారోహణ-అవరోహణ గతులను చక్కగా అర్థం చేసుకొని , వేణువు మీద మధురంగా వాయించగలగడమే గాక, ఆయా పాటల పదాలు, అక్షరాలను శ్రోతలు స్ఫుటంగా

తెలుసుకోగలిగేటట్లు వేణువాదం చేయగల సమర్థుడు.

**వైణికుడు :** షాడ్జి, నైషాది, ధైవతి, పాంచమి, మాధ్యమి, గాంధారి, ఆర్షబి అనే సప్తస్వరాలను మంద్ర, మధ్యమ, ఉచ్ఛస్థాయిల్లో స్వరక్రమానికి భంగం వాటిల్లక సుమధురంగా వాయించగల మేటి విద్వాంసుడు.

**రంగస్థలం :** గణ్యులైన శిల్పుల చేత ఎంపిక చేయబడ్డ ఆ రంగస్థలంలో ఏడు కోలల వెడల్పు, ఎనిమిది కోలల పొడవు కలిగిన గుంతను తవ్వి మట్టిని తీసి వెదురు బద్దలతో నింపి వేదికనమర్చి నలువైపుల స్తంభాలను నిలిపి, రెండు వాకిళ్ళు పెట్టి వాటిపైన 'వజ్రదేహ, వజ్రదండ, వరుణ, రక్తకేశు'లనే చతుర్వర్ణ భూతాలను చిత్రించి, స్తంభాల నీడలు రంగస్థలం మీద పడనట్లు దీపాలను అమర్చి, తెరలను , వాటి మీద ముత్యాల సరాలను రమణీయంగా అమర్చి తీర్చి దిద్ది సిద్ధం చేశారు.

ఆ రంగస్థలం రాజమందిరం ముందు అమర్చబడగా, ఒక శుభముహూర్తాన 'తలకోల' అనే వెదురు గొడుగుకు బంగారుకుండల్లో తెచ్చిన పుణ్యజలాలతో నీరాజనం సమర్పించి, దానిని ఊరేగింపుకు తీసుకొని వెళ్ళి తిరిగి తెచ్చి రంగస్థలం వద్ద దాన్ని నిలుపగా,

రాజు, మంత్రి, సేనాపతి మొదలైనవారు తమ తమ ఉచితాసనాల మీద అమరిన తర్వాత, మాధవి పైన వివరించిన తన ఆచార్యులు వెంట రాగా, మేళ, తాళకర్తల సమేతంగా రంగ ప్రవేశం చేసి, తన కుడికాలు ముందు పెట్టి రంగస్థలంలో కుడివైపున నిలిచి, దేవతాస్తుతితో ప్రారంభించి, వేణువు, వీణ, వాటిననుసరించి మృదంగ, ఘటాది పక్కవాద్యాలు లయబద్ధంగా తాళం సమకూర్చగా మాధవి రూపక, ఝంప, త్రిపుట, ఆట, ఏక తాళాలనే పంచ తాళాల ప్రభంధంతో పాడుతూ, పాటకు తగినట్లు నాట్యమాడుతూ ఏక తాళంతో ముగించి దేశి నృత్త, నృత్య, అభినయంతో సభికులను పరవశింపజేసింది. ఆమె నాట్యాన్ని చూసి అచ్చెరువొందిన రాజు ఆమెకు గాన, నాట్యకళల్లో 'తలకోరి' అనే బిరుదునిచ్చి పచ్చలమాల, అరతవ్వ బంగరు నాణాలు బహుమతిగా ఇచ్చి, చాల గౌరవించాడు. మాధవి నాట్యాన్ని చూసి పరవశించిన ప్రేక్షకుల్లో కోవలన్ కూడ ఉన్నాడు.

మరకతమాలను వేయి టంకాలిచ్చి ఎవరు కొంటారో అతడే మాధవి భర్త అని దండోరా వేయించగా, అది విని కోవలన్ తన దగ్గరున్న ధనంతో దాన్ని కొని, మాధవి

వలలో పడి తన ఇంటిని, పత్ని కన్నగిని పూర్తిగా మరిచిపోయాడు.

~~~
~~~

## ఆనందలహరి - దుఃఖసముద్రం

రేడు కానరాడు, నెలరేడు మొగము చాటు వేసెను, మగడు కాన వచ్చి చాల కాలంబయ్యె - ఇల్లాలు కన్నగి చింతాక్రాంతురాలై కలతబారిన మనస్సుతో కన్నీటి పర్యంతం కోవలుని ఎదురుచూస్తూ కాలం గడపసాగింది.

కన్నగి పరిస్థితి ఇలా ఉండగా, మాధవి తన ప్రియుడు కోవలునితో సరససల్లాపాడసాగింది. సాయం వేళ తన ఇంటి ఉద్యానవనంలో కోవలునితో మల్లె పొదల మధ్య విహరిస్తూ, ఆ మల్లెల సువాసనను ఆఘ్రాణిస్తూ, ఆ పూల మకరందాన్ని గ్రోలి మత్తెక్కిన తుమ్మెదల ఝుంకారాన్ని వింటూ మైమరచిపోసాగింది మాధవి. రాత్రులేమో మల్లెపూలు పరిచిన పట్టు పానుపుమీద ప్రియుడు కోవలునితో రతీమన్మధ లీలలతో ఆనందలహరిలో తేలిపోసాగింది.

ప్రియుని ఎడబాటు వల్ల తాళిబొట్టు తప్ప ఇంకే ఆభరణాలు కూడ ధరించక, వెన్నెలను, తన తోటలోని పూల సువాసనను, తుమ్మెదల ఝుంకారాన్ని ఆస్వాదించక తన పరుపు మీద అవిశ్రాంతంగా అటూ ఇటూ పొర్లుతూ కుంగిపోసాగింది కన్నగి.

~~~
~~~

## ఇంద్రోత్సవం

పుహార్ పట్టణ సౌందర్యం, ప్రకృతి అందాలు, సిరిసంపదలు మాటల్లో వర్ణించనలవికావు.

తూర్పు తెలతెలవారుతుండగా ఉదయసూర్యుని బంగారు లేతకిరణాలు మేడల హరిణాక్షాల[4]వంటి అందమైన గవాక్షాలనుంచి ప్రసరించగా, ఆ మేడల అందం మరింత ఇనుమడించింది. సాగరతీరాన నివాసమేర్పరచుకొన్న యవనుల (గ్రీస్, ఈజిప్ట్ మొదలైన విదేశాలనుంచి వచ్చిన వర్తకులు) మేడలు మరింత సొగసుగా కానవస్తున్నాయి.

ఆ పట్టణపు వీధులు చూడ చాల ముచ్చటగా ఉన్నాయి - సుతిమెత్తని పట్టు, ఉన్ని, నూలు వస్త్రాలు నేసే సాలెవాళ్ళ వీధి, ముత్యాలు, రత్నాలు, పగడాలు రాసులు పోసుకొని అమ్ముతున్న రమణీయమైన వీధి, దాని తర్వాత కలమ[5], కాయధాన్యాలు రాసులు పోసి అమ్ముతున్న వీధి , ఆ తర్వాత రుచికరమైన తినుబండారాలు, తమలపాకులు, పంచవాసములు[6], చేపలు అమ్ముతున్న వీధి - ఇలా ఆ పట్టణవీధులు పలువిధాలుగా విభజించబడి చూపరుల మనసునాకట్టుకొంటున్నాయి .

ఇక ఆ వీధుల్లో ఎవరెవరు నివసిస్తున్నారు? రధులు, సారధులు, సేనాపతులు, రాయబారులు, వేటగాండ్రు, వైతాళికులు, పండితులు నిండిన పాఠశాలలు.

అక్కడక్కడ వస్తువులు కొనుగోలు చేసుకొనేవారితో కిటకిటలాడుతున్న పెద్ద పెద్ద అంగళ్ళు, వీధి చివర భూత దేవాలయం, గుడి వాకిట బలిపీఠం, అక్కడ ఉంచిన గుగ్గిళ్ళు, పొంగలి మొదలైన భక్ష్యభోజ్యాలు- ఇలా ఎటు తిరిగినా ఆసక్తికరమైన దృశ్యాలు కానవస్తున్నాయి.

ఆ ఊళ్ళో మనకు కానవచ్చే ప్రతి మంటపానికి ఒక ప్రత్యేకత ఉంది. అదేమిటో

---

4 లేడి కనులు

5 కలమధాన్యాలు 8 రకాలు : వడ్లు, ఎరుకలు, రాగులు, కొఱ్ఱలు, చామలు, వెదురు వడ్లు, ఎర్రవడ్లు, జొన్నలు

6 పంచవాసములు = లవంగాలు, కుంకుమపూవు, పచ్చకర్పూరం, ఏలకులు, జాజి

చూద్దాం.

చోళరాజు ముచికుందుడు ఉత్తరదేశం మీద జైత్రయాత్రకు వెళ్ళేముందు తన కులదేవత వెలసిన భూతాలయానికి వచ్చి అక్కడ బలిపీఠం ముందు గుగ్గిళ్ళు, పొంగలి మొదలైన భక్ష్యాలు సమర్పించి తన పెద్దసైన్యంతో వెళ్ళి, హిమవత్పర్వతం మీద తన పులి జెండాను నాటి విజయుడై తిరిగి వచ్చినప్పుడు, ఆ మహీపాలునికి వజ్రదేశాధిపతి ముత్యాల గొడుగును కానుకగా సమర్పించిన రాజమంటపం ఆనాటి మహాశిల్పుల శిల్పచాతుర్యానికి ప్రతీకగా మనకు కానవస్తుంది.

ఆ ఊళ్ళో దొంగతనమనేది లేదు. ధాన్యరాసులు ఉంచిన ధాన్యాగారాలకు తాళాలు వేయరు. అటువంటి ఊళ్ళో కొత్తవారెవరైన ఆ ధాన్యాలను దొంగిలించేందుకు ప్రయత్నించి పట్టుబడితే వారి మెళ్ళో ఆ ధాన్యాల మూటలు కట్టి ఊరంతా తిప్పి దండోరా వేసి, ఆ ధాన్యాలను మళ్ళీ వారికే ఇచ్చి సభామంటపానికి తీసుకొని వచ్చి, అందరి ముందు నిలబెట్టి ఇక జన్మలో దొంగతనం మాటెత్తకుండ చేస్తారు. అటువంటి ఘనమైన మంటపం **సభామంటపం** .

గూనివారు, మూగవారు, మరుగుజ్జులు, దీర్ఘవ్యాధిగ్రస్తులు ఒక్కసారి మునిగితే ఆ పూర్వవ్యాధులు మాసిపోయే దివ్యమంగళ తీర్థమంటపం ఇంకొక అద్భుతం ఆ పట్టణంలో.

పిచ్చివాళ్ళు, పాము కాటుతో ఒళ్ళంతా విషపూరితులైనవారు , దెయ్యం పట్టినవాళ్ళు- వీరంతా ఒక్కసారి ప్రదక్షిణం చేస్తే అదంతా వీడిపోయే మహిమాన్వితమైనది రాతిమంటపం.

దొంగ స్వాములు, పతులను వంచించే సతులు, పరకాంతలమీద మరులుగొనే దుశ్శీలురు, లోలోపల కుట్రలు చేసే నీచబుద్ధిగల మంత్రులు, తప్పుడు సాక్ష్యాలు చెప్పే నీచులు - తన పాశానికి చిక్కిపోతారని పట్టణం చుట్టూ నాలుగామడల దూరం వరకు వినిపించేటట్లు గొంతెత్తి అరిచి ఆ విధంగానే వారిని పట్టి బంధించి తీసుకొని వచ్చి వాతలు పెట్టే భూతం నివసించే నాలుగు వీధుల కూడలిలో ప్రభుధర్మ పక్షపాతంతో కళ్ళవెంట బాష్పాలు విడిచే విచిత్ర ప్రతిమ వెలసిన భవ్య మంటపం.

ఆ పట్టణమెప్పుడూ పండుగలు, పబ్బాలు, ఉత్సవాలతో కోలాహలంగ

ఉంటుంది. పైన వివరించిన ఐదు మంటపాల్లో నిత్యార్చనలు, మంగళవాద్యఘోష్టి జరుగుతుంటాయి.

మరిప్పుడేమో ఇంద్రోత్సవం! పట్టణమంతా మరింత కళకళలాడుతూంది. ధనికుల మేడల వాకిళ్ళు , స్తంభాలు మణి, మాణిక్య, మరకత తోరణాలతో అలంకరించబడ్డాయి. బంగారు పూర్ణకుంభాలు, చేతి దీపాలతో పురప్రజలు స్వాగతించగా రధ, గజ, తురగ వాహనాల మీద వణిజ కుమారులు వెంటరాగా, రాకుమారులు ఆ పట్టణవీధుల వెంబడి ఊరేగింపుగా వెళుతున్నారు. రాజు వివిధ దేవజాతులకు తగిన రీతిన ఆయా ఆలయాల్లో పూజలు, పునస్కారాలు, వేదోక్తంగా హోమవిధులు జరిపుస్తున్నాడు. కిన్నర, కింపురుష, గరుడ, యక్ష, రాక్షస, గంధర్వ, సిద్ధ, చారణ, విద్యాధర, భూత, భేతాళ, తారాగణ, ఖేచర, భోగవాసులు మొదలైన పద్దెనిమిది కులదేవతలకు ఆయా గ్రామదేవతాలయాల్లో ఉత్సవాలు జరుగుతున్నాయి. ఉత్సవాలతోబాటు ఆయా గుళ్ళలో ధర్మవిధులు, తత్వం, ఉపదేశవాక్యాలు బోధించబడుతున్నాయి. ఈ ఇంద్రోత్సవ సందర్భాన రాజు బంధించబడ్డ శత్రురాజులకు విడుదల ప్రసాదించడం కద్దు. ఆ సందర్భాన్ని సంగీతవాద్యఘోషలతో వేడుకగా జరుపుకొంటున్నారు.

ఇక కోవలన్ సంగతి చూస్తే, విరహవేదన అన్నదే తెలియక, మల్లెలు, జాజులు, చెంగల్వలు కూర్చి కట్టిన మాలల సుగంధాన్ని ఆఘ్రాణిస్తూ, మాధవితో సరససల్లాపాలాడుతూ ఇంద్రోత్సవ వేడుకల్లో మైమరచిపోతున్నాడు.

మరి కన్నగికి మిగిలింది విరహవేదన మాత్రమే.

~~~
~~~

## సముద్ర స్నానం

ఇప్పుడిక ఆ ఇంద్రోత్సవం వెనక ఉన్న కథేమిటో కాస్త తెలుసుకొందాం.

గరుడుడు అమృతాన్ని తీసుకొని వెళ్ళినప్పుడు, తన పురుహూత నగరాన్ని కాపలా కాయగల వీరుడెవ్వరని ఇంద్రుడు యోచించినప్పుడు ముచికుంద చోళుడే అందుకు సమర్థుడని ఎంచి అతన్ని అందుకు నియమించి, అతనికి సాయంగా ఒక భూతాన్ని కూడ ఇచ్చి వెళ్ళాడు. ఇదే మంచి సమయమని ఎంచి అసురులు దాడి చేసి ముచికుందుని మీద అంధకారాస్త్రాన్ని ప్రయోగించి కలవరపరచగా, అంతలో భూతం చీకటికి పారదోలింది. వెంటనే ముచికుందుడు అసురులను తరిమికొట్టాడు. ఇంద్రుడు తిరిగి వచ్చిన తర్వాత జరిగింది తెలుసుకొని చాల సంతోషపడి, ఆ భూతాన్ని ముచికుందుని పుహార్ నగరానికి కాపలాగా ఉండేందుకు ఇచ్చి పంపాడు.

అప్పటినుంచి ప్రతియేడు ఆ నగరంలో ఇంద్రోత్సవాలు చాల వేడుకగా జరుపుకోవడం సంప్రదాయమైంది. ఆ ముచికుంద భూపాలుని మూలంగా భూమికి తేబడ్డవి ఆ అయిదు మహిమాన్విత మంటపాలు. అవి ఇంద్రలోకంలో ఉన్నప్పుడు ఒకసారి సభలో నారదుడు తన వీణను మీటుతూ మధురమైన సంగీతాన్ని వినిపిస్తుండగా , ఇంద్రుడు పరవశించి ఊర్వశిని నాట్యమాడమని ఆజ్ఞాపిస్తాడు. ఆమె ఆడుతుండగా, ఇంద్రుని కొడుకు జయంతుడు ఆమెపై మరులుగొని ఆమె ఎదుట రాగా, ఆమె కూడ అతడిని చూసి మైమరచిపోగా, ఆమె ఆట పాట తప్పుతాయి. వాద్యాల సంగీతం కూడ క్రమం తప్పుతుంది. అది గమనించిన ఇంద్రుడు కోపించి ఊర్వశి మానవజన్మనెత్తేటట్లు , జయంతుడు వెదురుగా పుట్టేటట్లు శపిస్తాడు. వారు శాపవిముక్తి కోసం వేడుకోగా, ఇంద్రుడు ముక్తిని కూడ అనుగ్రహిస్తాడు.

ఆ విధంగా దేవకన్య ఊర్వశి భూలోకంలో పుహార్ నగరాన మాధవిగా పుట్టిందట.

ఆ తర్వాత ఒకసారి చోళదేశంలో, ముఖ్యంగా పుహార్ నగరంలో ఇంద్రోత్సవాలు జరుగుతున్నప్పుడు ఇంద్రుడు తన సతీదేవితోబాటు ఇంద్రలోకంనుంచి చోళదేశానికి వచ్చి ఆ దేశపు సిరిసంపదలను, పాడిపంటలను తన దేవికి చూపించాడు. ఆ తర్వాత ఇంద్రోత్సవం వేడుకలను ఇద్దరూ చూసి ఆనందించసాగారు. మాధవి ఆడిన వివిధ

నాట్యాలు వారిని అలరించాయి - చతుర్వణాల స్తుతి, ఔషధీశుని స్తుతి, భూతగణాతి నేత (శివుడు) ఆడిన లోక అభయ తాండవం , బాణుని గెల్చిన తర్వాత కందుడు [7]ఆడే ఆట, పేడి ఆట, దైత్యుల చేష్టలు పడక శాంభవి సమర రంగంలో ఆడే మరగాళ్ళ ఆట, లక్ష్మి చక్కని చుక్కలాగ ఆడే బొమ్మలాట, బాణుని ఉత్తర ద్వారం బయట కాపు వనిత వేషంలో ఇంద్రాణి (ఇంద్రుని భార్య) ఆడే కాపుల ఆట, ఇలా పదకొండు ఆటలను మాధవి ఆడి చూపుతుందని ఇంద్రుడు తన సతీదేవికి తెలుపగా, ఆ ఆటలను ఇద్దరూ చూసి ఆనందించసాగారు .

ఇలా వేలుపులు (దేవతలు) చూసి ఆనందించేటట్లు మాధవి ఆటలు, పాటలు ముగించి తన భవనానికి చేరింది. కోవలునికి విరహం పోగొట్టేందుకు మంచినూనె నలుగు పెట్టుకొని, అనేక మూలికలు నాన్చి, కాచిన నీట స్నానంచేసి, ధూపం వేసి జుత్తు ఆరబెట్టుకొని, జల్తారు పావడా ధరించి, మెడలో రత్నాల కంటె, చేతులకు రత్నాలు పొదిగిన అపరంజి గాజులు , వేళ్ళకు వంకీల ఉంగరాలు తొడుక్కొని, వజ్రాలు పొదిగిన కమ్మలు ధరించి, పాపిట బొట్టు పెట్టుకొని వచ్చి ఆతనితో సరససల్లాపాలాడుతూ విరహవేదనను పోగొట్టసాగింది మాధవి.

అలా వారిద్దరికి రాత్రి గడిచిందే తెలియదు. పండుగ చివరి దినం తూర్పు తెల్లవారక మునుపు పురప్రజలు ఉత్సాహంతో నిండు పున్నమి వెన్నెలలో సముద్రస్నానానికి వెళుతుండడం గమనించి మనసు పులకరించగా ఇద్దరు చకచక సిద్ధమైనారు. మేఘహస్తుడనే మేటి అశ్వం పూన్చిన గుర్రపు బండిలో మాధవి, కోవలన్ కూర్చోగా ఆ బండి ధనవంతుల వీధులు, పూలమ్మే వీధులు, అంగళ్ళ వీధులు, సిరిసంపదలతో తులతూగే విదేశీయుల వీధి, ప్రసిద్ధ ధాన్యాగారాల వీధి, అనేక రకాలైన చేపలమ్మే వీధి, ఇలా దివిటీలు, దివ్వెలతో వెలిగించబడ్డ రకరకాల వీధులను దాటుకొని సముద్ర తీరాన పడవలకు ఓడరేవు ఉనికి తెలిపేటట్లు పెద్దగా దివిటీలు వెలిగించబడ్డ చోటికి చేరుకొన్నారు. అక్కడి తోటల్లో భూవరులు, రాకుమారులు, వారి బంధుమిత్రులు ఆటపాటలతో ఆనందిస్తున్నారు. కరికాల చోళభూపతి పండుగ చివరి దినాన్ని

7 కందుడు = స్కందుడు/సుబ్రమణ్యస్వామి

పర్వదినంగా, గెలుపొందిన దినంగా ప్రకటించగా ఆ కావేరి సంగమస్థలంలో ఇసుక వేస్తే రాలనంతగా క్రిక్కిరిసిన పురజనులు ఆనందాతిరేకంతో జయఘోషలు చేస్తూ ఇంద్రోత్సవం వేడుకలను పూర్తి చేసుకొన్నారు.

~~~
~~~

## తోట పాటలు

మాధవి చక్కగా పెళ్ళికూతురులాగ అలంకరించుకొని తన ఇంటనున్న సంగీత మంటపానికొచ్చి తన వీణకు నమస్కరించి చేతికి తీసుకొని శ్రుతి సవరించి, ఆరోహణ అవరోహణాలు సరిగా ఉన్నాయా అని చూసుకొని, శ్రుతులు, అనుశ్రుతులు చక్కబరుచుకొని ఆలాపనతో పాట ప్రారంభించి పాటకు తగిన తాళం వేస్తూ మరకత మణులు పొదిగిన ఉంగరాలు తొడిగిన తన సున్నితమైన వేళ్ళతో వీణ వాయిస్తూ రాగరసాలు ఒలికించి కోవలుని అలరించింది. ఆ తర్వాత వీణను కోవలునికి అందించి అతనికుచితమని తోచిన పాటలను పాడమని వేడుకొంది . అప్పుడు కోవలన్ వీణను తీసుకొని సముద్రతీరానున్న అడవి ప్రాంతాలవారి జాతీయ గీతాలు పాడసాగాడు.

(ఉత్పలమాల, చంపకమాల, మత్తేభవిక్రీడితం, కందం, తేటగీతి పద్యాలు)

ఒక పాటలో చోళరాజు ఉత్తరదేశం మీద దండయాత్రకు బయల్దేరి గంగానది వరకు వెళ్ళగా అది తెలిసి కావేరి ఈర్ష్యగొన్నదట. ఆప్పుడా చోళనృపాలుడు అది వీరసతి లక్షణం కాదని కావేరి(నది)కి నచ్చజెప్పాడట.

ఇంకొక పాటలో, 'పొలాలు దున్నుతున్న కాపులు ఎడ్లను అదిలించే కోలాహలం, చెరువు తూముల హోరు, చిన్నపిల్లల కోలాహలం, ఇదంతా నీవు ఇచ్చిన చోళ సంపద కద' అని చోళ రాజు కావేరిని పొగడి సముదాయించాడట.

మరికొన్ని పాటలు పుహార్ పట్టణంలో ఉన్న సరోవరాలను, వాటిలో విరగబూసిన అందమైన కలువలను అవి ఎలా ఆకాశంలో మిలమిలలాడే చంద్రతారాదులతో పోటీ పడుతున్నాయో వర్ణించాయి.

ఇంకొక పాటలో సముద్రపుటొడ్డున బాలికలు ఇసుకలో కేరింతలు కొడుతూ ఆడుకోవడం, యువతీయువకులు సముద్రతీరాన చెట్టాపట్టాలేసుకొని సరదాగా తిరుగుతుండడం చూస్తే అదే మా పుహార్ పట్టణమని సగర్వంగా చెబుతూ పాడుతాడు కోవలన్.

మరింకొన్ని పాటలలో ఆ ఊరి జవరాళ్ళ అందచందాలను, వారి హావభావాలకు యువకులెలా మతి పోగొట్టుకొంటారో వర్ణిస్తాడు కోవలన్.

పోను పోను కోవలన్ స్త్రీల శరీరావయవాలను వర్ణించడానికి మొదలు

పెట్టడంతో మాధవికి కోపమొచ్చి అతని సంగీతాన్ని పాటలను ఆమోదిస్తున్నట్లు నటిస్తూనే మెల్లగా అతని చేతినుంచి వీణను సుతారంగా తీసేసుకొని, తన ఉద్దేశాలు వేరని తెలిసేటట్లు తనకు నచ్చిన తోటపాటలను వీణతో శృతి కలిపి పాడనారంభించింది.

తుమ్మెదలు ఝుంకారం చేస్తుండే పూలతోటలు, నెమళ్ళు వయ్యారంగా విహరిస్తుండే తోటల పక్క గలగల పారుతున్న కావేరినదిని నాలుగు కాలాల పాటు అలాగే పారుతుండమని, తన సుపుత్రుడైన చోళరాజును చల్లగా చూడమని కోరుతూ కొన్ని పాటలు పాడింది.

మా పుహార్ పట్టణమెలాంటిదంటే, ఇక్కడ చిన్న పిల్లలు మాత్రమే కాదు, చిలుకలు కూడ ముత్యాలతో ఆట్లాడుతుంటాయి అని తన పురం గొప్పతనాన్ని ఇంకొక పాటలో చెప్పుకొంది మాధవి.

అయ్యో, మగువలకు లేనిపోని ఆశలు చూపించి నొప్పించడం మా ఊరిలో నీవెన్నడూ కానరావు అని ఇంకొక పాటలో పరోక్షంగా కోవలన్ని పొడిచింది మాధవి.

కానయితే, తనతో ఎన్నెన్నో అందమైన అనుభవాలు పంచుకొన్న తన ప్రియుడు దూరదేశాలకు వెళ్ళగా, ఆ ఎడబాటువల్ల కలిగిన బాధను కావేరి నదితోను, సముద్రరాజుతోను పంచుకొని కన్నీరు కార్చే భామ మనోవ్యధను మనస్సుకు హత్తుకొనేలా మరింకొన్ని పాటలు పాడి వినిపించింది మాధవి.

అది మాత్రమే కాదు, అతడెక్కడున్నా తనని మరువడని చాల నమ్మకంతో తన తోటలోని భారద్వాజపక్షికి, తన చెలికత్తెలకు చెబుతుందా విరహోత్కంఠిత మాధవి ఇంకొక పాటలో.

అలా పాడి మాధవి [8]షడ్జగాంధార శ్రుతులు సవరించి ఆ పద్ధతిలో కాసేపు పాడి ఆ తర్వాత ఒక అపూర్వమైన పాటను పాడసాగింది.

~~~

---

8 షడ్జశ్రుతి కలది - షాడ్జి (తమిళంలో శెంబాలై), గాంధారశ్రుతి కలది = గాంధారం(విళరిపాలై)
~~~

## వసంత సమయం

మాధవి పాటలను విని కోవలన్ ఆమె మీద అలిగి వెళ్ళిపోగా, ఉత్పలగంధి మాధవి మేడమీది చంద్రశాలకు వెళ్ళి పద్మాసనం వేసి కూర్చొని, అపశ్రుతి లేని వీణను తీసుకొని, తన కుడిచేతిని పతాకంగా మీటమీదుంచి, తన మృదువైన వామహస్తంతో వీణ తంత్రులను సుతారంగా తాకి, మధురంగా పాడుతూ వీణ వాయించసాగింది.

ఆమె ఎంచుకొన్న వీణకు పదునాల్గు తంత్రులు[9]. షడ్జం మధ్యమంగా శ్రుతి కూర్చి, షడ్జంతో మొదలై షడ్జంతో ముగిసే కాపుల[10]పాటల్లో గల నాలుగు తెగలు[11]బాగ గమనించి, పలికించి చూసి, గమకాల క్రమం చెడక సంపూర్ణరాగాలను పాడింది.

ఆలా పాడేటప్పుడు తన పూలబాణాలతో జగత్తునేలే మన్మధుని పుష్పాస్త్రాలకు గురై, కోవలన్‌కి ప్రేమలేఖ రాయాలనే ఆశ పుట్టగా, మల్లిక, చంపకోత్పలాది పుష్పాలు విరిసిన తన తోటకు వెళ్ళి మొగలిరేకు మీద స్వర్ణ ముకుళాన్ని (ఘంటం) పారాణిలో అద్ది రాయనారంభించింది మాధవి.

జగత్తులోని అన్ని జీవరాశులను జత చేసే వసంతుని తోసిపుచ్చి, ఇన్నాళ్ళు జతగా ఉన్న ప్రియుడిప్పుడు దూరమై, ప్రియురాలి పిలుపును నిర్లక్ష్యం చేయడం తగదని వాపోతూ ప్రేమలేఖను రాయడం ముగించి తన సెచ్చెలి వసంతమాలను పిలిచి, ఆమె చేతికి దాన్ని అందజేసి, 'ఈ లేఖలో రాసిన మాటలు కోవలన్ మనసుకెక్కేలాగ చదివి చెప్పమని' చెప్పి పంపింది మాధవి.

---

9 వీణలు నాలుగు విధాలు: 21 తంత్రులుగలది భేరి వీణ, 19 తంత్రులుగలది మకరవీణ, 14 తంత్రులుగలది చకోట వీణ, 7 తంత్రులుగలది చెంగోట్టు వీణ

10 కాపుల ఆట మరుదం. వేటగాళ్ల ఆట పాలై. తీరవాసుల ఆట వెయ్‌దల్, కానల్‌వరి. కొండవాసుల ఆట కురింజి, కుండ్రక్కురవై. గొల్లల ఆట ముల్లై, ఆయ్చుక్కురవై.

11 'మ' తో మొదలయ్యేది అగనిల్లై మరుదం
'మ' తుదిగా గలది పుఱనిల్లై మరుదం
'స' తో మొదలయ్యేది అరుగియల్ మరుదం
'స' తుదిగా గలది పెరుగియల్ మరుదం, కిన్నరం.

ఆ లేఖను విన్న కోవలన్, ‘‘రమ్మంటే రావడానికి, పొమ్మంటే పోవడానికి నేనామె దాసుడిని కాను. ఇదంతా నటన. ఆమెకు నా మీద నిజమైన ప్రేమే ఉంటే, నన్ను చూసేందుకు తానే వచ్చేది కద? “ అని కాస్త కోపంగా మాట్లాడగా, వసంతమాల వాడిన మోముతో విసవిసా వెళ్ళి మాధవికి సంగతి తెలియజేసింది. మాధవి కలతబారిన మనసుతో తన పట్టుపానుపు వదిలి నేలమీద ఒక మూల దీనంగా పడుకొని విలపించసాగింది .

~~~
~~~

## స్వప్న వృత్తాంతం

ఆ విశాలమైన పుహార్ పట్టణ వీధుల్లో సాయంకాలవేళ ఇళ్ళ ముంగిట కళ్ళాపిజల్లి ముగ్గులేసి వరిమొలకలు, మొల్ల పూలుజల్లి దీపాలు పెట్టే వేళ మాలతి అనే ఒక వనిత తన సవతిబిడ్డకు పాలిస్తున్నప్పుడా బిడ్డ ఆకస్మికంగా మరణించగా ఆ సవతి తల్లి ఆ బిడ్డ మృతదేహాన్ని తీసుకొని కన్నీరు మున్నీరుగా ఏడుస్తూ కల్పవృక్షమున్న దేవాలయం, రావణేంద్రుని దేవాలయం, సూర్య, చంద్ర దేవాలయాలు, శాతవాహన దేవాలయం, కైలాశేశుని దేవాలయం, బలదేవతాలయం - ఇలా ఆ ఊళ్ళో ఉన్న అన్ని గుళ్ళకూ వెళ్ళి తన బిడ్డను బతికించమని వేడుకొందట. అదేమీ ఫలించకపోగా, చివరికి ఒక పాషండవిద్వాంసుని (వేదబాహ్యుని) ఆలయానికి వెళ్ళి సాగిల పడింది. అప్పుడొక వికృతాకారం ప్రత్యక్షమై, 'ఘోరతపస్సు చేయనిదే దేవతలు వరమివ్వరని' చెబుతూ ఆ మృతదేహాన్ని లాక్కొని వేగంగా వల్లకాటికి వెళ్ళగా అక్కడ ఢాకిని దాన్ని తీసుకొని గుటుక్కున మింగేయగా అది చూసి అవాక్కైన మాలతిని చూసి ఆ వికృతాకారం, “చింతించకు, నీవు వెళ్ళే దారిలో నీ బిడ్డ ఒక చెట్టు నీడన దొరుకుతుందని' చెప్పగా, అదే విధంగా మాలతికి బిడ్డ ఒక చెట్టునీడన దొరుకుతుంది. మాలతి సంతోషంగా ఆ బిడ్డను తీసుకొని వెళ్ళి తల్లి ఒప్పజెబుతుంది. ఆ బిడ్డ పెరిగి పెద్దవాడై అన్ని విద్యల్లోను ప్రకాశించగా వాని తలిదండ్రులు చాల సంతోషపడుతారు. వారు దివంగతులైన పిమ్మట వారికి తగిన అంత్యక్రియలు జరిపిన తర్వాత తన భార్యతో కలిసి జీవనం సాగిస్తాడు.

దేవంతి అనే దేవత ఈ కథను తన ఆలయానికి వచ్చిన కన్నగికి వినిపించగా, అప్పుడు కన్నగి తన భర్త తీర్థయాత్రకు వెళ్ళాడని, అతడు తిరిగి వచ్చేవరకు ఈ దేవళం (దేవాలయం)లోనే ఉంటానని చెప్పి అక్కడే పడుకొని నిద్రించింది. ఆ నిద్రలో ఆమె ఒక భయంకరమైన కలగన్నది. మేలుకొన్న వెంటనే ఆ స్వప్నవృత్తాంతాన్ని ఆ దేవతకే ఇలా చెప్పుకొచ్చింది: తాను తన భర్త కోవలన్‌తో కొత్త ఊరికి వెళ్ళిందని, అక్కడ అతడు చేయని తప్పుకు అతని మీద నింద మోపారని, అతనికొచ్చిన ఆపద విన్న వెంటనే తాను రాజాస్థానానికి వెళ్ళి న్యాయం కోరానని, దాని పర్యవసానంగా ఆ ఊరికే ముప్పు కలిగిందని చెప్పింది. ఇదంతా విన్న దేవంతి, కన్నగి పూర్వజన్మలో తన వల్లభునికి (భర్తకు) చేయదగిన వ్రతాలు చేయలేదని, కావేరి సంగమ స్థలంలో ఇందుకుండం,

భానుకుండం అని రెండు తీర్థాలున్నాయని, వాటిలో మునక వేసి అక్కడే ఉన్న ఆలయానికి వెళ్ళి మదనదేవుని భక్తితో పూజిస్తే అతివలు ఈ ధరణి(భూమి) మీద పతి ఎడబాయక జీవిస్తారని, మనం కూడ ఒకసారి వెళ్ళి చూసి వద్దామా అని దేవంతి అనగా, కన్నగి మా కులంలో పతిదేవుని తప్ప ఇంకే దేవుని పూజింపమని అంటుండగానే ఒక దాసి పరుగెత్తుకొని వచ్చి వాకిట మన రాజు కోవలన్ వచ్చాడన్న వార్త అందించింది. అప్పుడాతడు లోనికొచ్చి వాడిపోయి ఉన్న తన ఇల్లాలిని చూసి, వంచనే జీవనంగా బతికే ఒక వన్నెలాడి చేత మోసపోయి, పూర్వీకులు సంపాదించి పెట్టిన సంపదంతా పోగొట్టుకొన్నానని కన్నగికి చెప్పి వాపోతాడు. అప్పుడు కన్నగి చిరునగవుతో, ''నా ప్రాణవల్లభా! చింతించకు. నా ఈ అందెను తీసుకొని మదురైకి వెళ్ళి దాన్ని మూలధనంగా పెట్టి, పోగొట్టుకొన్న సంపదకన్న ఎక్కువ గడింతువు గాక!'' అని చెప్పి ప్రోత్సహించి, ఇన్నాళ్ళకు తిరిగి వచ్చిన భర్తకు తగిన ఉపచర్యలు చేసి, మరునాడు వేకువనే లేచి ప్రయాణానికి అన్నీ సిద్ధం చేసింది.

~~~
~~~

## దేశ సందర్శనం

మరునాడు సూర్యుడుదయించక మునుపే కోవలన్, కన్నగి ప్రయాణానికి సిద్ధమై ఇల్లు విడిచి బయల్దేరారు.

మొదట విష్ణుదేవాలయాన్ని దర్శించుకొని, తర్వాత ఐదు మహాశాఖలున్న మహాబోధి వృక్షం కింద బుద్ధదేవుని వచనాలను వివరించే చారణులను దర్శించి, వారి బోధలను శ్రద్ధగా ఆలకించి, ఆ తర్వాత ఏడు ఇంద్రవిహారాలను దాటి, పంచేంద్రియాలను జయించిన సత్పురుషులు వెలసిన మహామంటపంలో అశోకవృక్షం నీడన 'తేరు, తిరునాళ్ళు, అభిషేకాలు జరిగే దినాల్లో చారణులకు ప్రవేశముంద'ని రాసిన శిలాశాసనానికి నమస్కరించి, దానికి ప్రదక్షిణం చేసి, అవతల పురవీధులను దాటుకొని కోట వాకిలి దాటి, ఇరుపైపుల ఉన్న ఉద్యానవనాలను చూసుకొంటూ, పడమటి దిక్కుగా నడిచి వెళుతూ కావేరి నదీతీర సంగమ ముఖద్వారాన్ని చేరుకొన్నారు.

అప్పటికి కన్నగి చాల అలిసిపోయింది. అక్కడే ఉన్న కౌంతిస్వామిని వసించే తోటలో ఆ రాత్రి విశ్రమిద్దామని నిశ్చయించుకొన్నారు. మదురై ఇక్కడికెంత దూరమని అడిగినప్పుడు గృహిణి (కౌంతి[12]స్వామిని) నవ్వి మదురై మన దేశానికి అయిదారామడల దూరంలో ఉందని తెలియజేసింది. అప్పుడు వారిద్దరు కౌంతి పాదపద్మాలకు సాష్టాంగ నమస్కారం చేసి, తాము ద్రవిడభూమిలో పేరుగాంచిన మదురైకి వెళ్ళి సన్మార్గంలో ధనసంపాదన చేయదలచి వెళుతున్నామని, కరుణతో తమనాశీర్వదించి పంపమని వేడుకోగా, కౌంతి రాళ్ళు, రప్పలు, ముళ్ళతో కూడిన కొండదారులు, అడవిమార్గాల వెంబడి సుతిమెత్తని పాదాలున్న కన్నగి నడిచి వెళ్ళడం చాల కష్టసాధ్యమని, అయినా కూడ నియమనిష్ఠలతో జీవిస్తున్న వారికి అది సులభసాధ్యం కాగలదని దీవిస్తుంది కౌంతి.

మళ్లీ కౌంతి కోవలుని చూసి, "బిడ్డా, నీవెరుగని ఈ దారిలో చాల ప్రమాదాలు ఎదురుకావచ్చు. ఎండ కన్నెరుగని ఈ కోమలాంగిని చెట్టు నీడల వెంబడి, తోటల వెంబడి పిలుచుకొని వెళ్ళ చూడవచ్చు, కాని దున్నిన పొలాల్లో దుంపల ముక్కలు, ముళ్ళు

---

12 కౌంతి = కుంతీదేవి, రేణుక అనే ఒక సుగంధ ద్రవ్యం

బాధించవచ్చు. చెరువు తూములనుంచి పొంగి పొర్లే నీటిని చూసి ఆమె భయపడవచ్చు. అయినా కూడ భయం వలదు. దారి పొడుగునా మంచినీళ్ళ బావులుంటాయి. వాటి నీరు చాల తియ్యనిపై ఆమెకు సేద తీరుస్తాయి. పొలాలు, తోటలు, చెరువులు లేని మార్గాలు లేవు, జాగ్రత్తగా చూసుకొంటూ వెళ్ళండి, [13]అక్షరదైవం మీకు తోడు" అని ఆశీర్వదించి తాను కూడ వారి వెంట నడిచింది.

దారి పొడవునా కావేరి నదీజలాలతో పుష్కలంగా పండుతున్న వరి పొలాలు, చెరకుతోటలు చూసుకొంటూ, నీరెత్తి పోసే ఏతాల (కపిల) గలగలలు, వరి పొలాల్లో పంటను తూర్పార పడుతున్న కూలివారి 'పోలి' పాటలు వింటూ ముందుకు సాగారు కోవలన్, కన్నగి.

ఇలా నిదానంగా అన్నీ చూసుకొంటూ వెళ్ళడం వల్ల వారు రోజుకొక్క ఆమడ దూరం కూడ నడవలేకపోయారు. అయినా వారందు గురించి బాధపడక, కావేరి నది వల్ల సారవంతమైన తమ చోళరాజ్యాన్ని మెల్లగా దాటి ముందుకు వెళుతుండగా ఒక మంటపంలో ధర్మబోధలు చేస్తున్న ఒక చారణుడు వారికి కానవచ్చాడు. ఆతడు కౌంతికి సత్కార్యాలు చేయడం వల్ల కలిగే సత్ఫలాలు వివరించి, సృష్టికర్త, స్వయంభువు, మహాయోగి అయిన భగవంతుని సేవతో మానవులకు ముక్తి లభిస్తుందని బోధించగా, తపస్విని కౌంతి ఆ చారణునికి నమస్కరించి "నా చెవులు విజ్ఞానదాయకమైన ధర్మవాక్యములు తప్ప నిరర్థకమైన పలుకులు వినవు, నా నాలుక ఆ భగవంతుని వేయిన్నెనిమిది నామములు తప్ప ఇంకేమీ ఉచ్చరించవు, నా మేను అర్హోపదేశకుడైన సర్వజ్ఞునికి తప్ప ఇంకెవరికి చెందదు, నా హస్తద్వయం ఆ భగవంతుని పద్మపాదములను మాత్రమే తాకునని" చెప్పగా, ఆ చారణుడు చాల సంతసించి తన ఆసనం వదిలి ముందుకు వచ్చి, "ఓ ముదితా! నీ జన్మబంధాలు విడిపోవుగాక!' అని చెబుతూనే ఆకాశమార్గానికెగసి వెళ్ళగా, కౌంతి కూడ నమస్కరించి "బంధముక్తి అగుగాక!" అని చెప్పి, కోవలన్ కన్నగి సమేతంగా కావేరి నదీతీరానున్న ఒక పడవెక్కి, అవతలి గట్టునున్న ఒక మంటపానికి చేరుకొన్నది. అప్పుడక్కడికి ఒక వాచాలుడు ఒక

---

13 అక్షరదైవం = బీజాక్షరాలు (అ సి ఆ ఉ చ) కల దైవం

వ్యభిచారిణితోబాటు వచ్చి, కౌంతిని చూసి, రతీమన్మధుల్లాగున్న వీరిద్దరెవ్వరని అడుగగా, అందుకు కౌంతి వీరిద్దరు నా బిడ్డలని సమాధానం చెప్పింది. అందుకా వాచాలుడు వెటకారంగా నవ్వి, 'ఒకే తల్లి కడుపున పుట్టిన బిడ్డలు దంపతులు కావడం నేను చూసి ఎరుగను" అన్నాడు. అది విని కౌంతి కోపంగొని అతన్ని, అతనితోనున్న వ్యభిచారిణిని నక్కలై పుట్టమని శపించింది. అంతలో కన్నగి వారిమీద జాలిగొని వారికి శాపవిముక్తి ప్రసాదించమని కోరగా, అప్పుడు కౌంతి, వీరు ఉరైయూరు కోట వెలుపలున్న తోటలో పండ్రెండు మాసాలపాటు కాయకష్టం చేస్తే శాపవిమోచనం కలుగుతుందని చెబుతుంది కౌంతి. తర్వాత అక్కడినుంచి వారు కోడియూరు అనే ఊరికి వెళ్ళారు.

-: ఇంతటితో పుహార్ కాండమ్ సమాప్తం :-

# అందెల కథ

## రెండవ భాగం

***మదురై కాండమ్***

## అటవీ సందర్శనం

కౌంతి, కోవలన్, కన్నగి ఆ రోజు ఆదిదేవుడు వెలసిన, అశోకవృక్షాల వనంలో విశ్రాంతి తీసుకొని, మరునాడుదయమే లేచి బయల్దేరి పొలాలు, కొలనులు దాటి, చుట్టూ పూలచెట్లున్న ఒక మంటపాన్ని చేరుకొన్నారు. అప్పుడక్కడికి ఉత్తరాన గంగను, గుబ్బిలిని జయించిన తన పాండ్యరాజును పొగడుతూ ఒక విప్రుడు (బ్రాహ్మణుడు) అటుగా వచ్చాడు. ఆయనను చూసి కోవలన్ 'ఆయ్యా! మీరెవరు? ఇటు రావడానికి కారణమేమి?' అని అడుగగా, ఆ విప్రుడిలా సమాధానమిచ్చాడు: 'ఓ పుణ్యపురుషా! బంగరుతల్పం మీద శేషశయనుడై, ఇరువైపుల సూర్యచంద్రులు వెలయగా, వక్షస్సున కౌస్తుభం వెలుగొందుతున్న ఆ కమలనేత్రుని కనులార చూసి తరింప వచ్చితిని. మా ఊరు మాంగాడు. మా పాండ్యరాజు మహిమ వల్ల చల్లగ సిరిసంపదలతో ఈ దేశం తులతూగాలని దీవింపవచ్చితిని'. అప్పుడు కోవలన్ అక్కడినుంచి మదురైకి వెళ్ళడానికి సులభమైన మార్గం చెప్పమని కోరగా, ఆ విప్రుడిలా దారి చూపాడు:

"ఆహ్! దక్షులైన మంత్రులను చేరదీయని రాజు పాలనలో అరాజకమై, చల్లని భూములు చెడి మరుభూములైవున్నప్పుడు మృదులాంగియైన చెలువతో బయల్దేరితిరి కద! కానివ్వండి. రాళ్ళు, రప్పలు, ఎక్కరాని గుట్టలమయంగా ఉన్న ఈ ప్రాంతాన్ని దాటిన తర్వాత ఈ దారి కొడుంబాళూర్ అనే ఊరికి వెళుతుంది. దానికవతల కుంట గట్టున విలుకాని త్రిశూలాగ్రంలాగ మూడు తోవలు కానవస్తాయి. వాటిలో కుడి తోవ వెంబడి వెళితే కారు మామిడి చెట్లు, ఎండిన వెదుర్లు, పొదల వెంబడి దుప్పులు, లేళ్ళు తిరుగాడుతూ, ఆటలాడుతూ కానవచ్చే వేటగాళ్ళ పల్లె పక్కన ఒక దారి కనిపిస్తుంది. ఆ దారిన వెళితే పర్వతప్రాంతాల్లో పండే వరి పొలాలు, చెఱకు తోటలు, కొబ్బరిచేలు, పసుపు, వెల్లుల్లి పండే పొలాలు, పోకచెట్లు, అరటితోటలు విస్తారంగా ఉండే పాండ్యరాజ్యాన్ని చేరవచ్చు. ఆ తోవను పోక, ఎడమ తోవ వెంబడి వెళితే కొన్ని అడవులు, కొండలు దాటిన తర్వాత ఒక కొండపైని బిలంలో కొన్ని విచిత్రమైన తీర్థాలు కానవస్తాయి. వాటిలో తొలితీర్థాన జలకమాడితే దేవవ్యాకరణజ్ఞానం సిద్ధిస్తుంది. ఇంకొక తీర్థం భవహారిణి, అంటే దుఃఖాలను పోగొట్టుతుంది. మూడవది ఇష్టసిద్ధి తీర్థం. ఆ కొండపైన వెలసిన దేవుని పూజించి మూడు ప్రదక్షిణాలు చేసిన తర్వాత ముందుకు వెళితే భూమి చీలినట్లున్న

లోతైన లోయలో ఒక గోగు చెట్టు కింద ఐదు నల్లని జడలతో ఒక కన్య మీకు కానవస్తుంది. ఆమె మీకిలా చెబుతుంది: 'ఈ మేను ఇచ్చే శాశ్వత సుఖాలేమిటో మీరు చెప్పగలిగితే నేను ఈ బిలం తలుపు తెరిచి ముందుకు వెళ్ళే తోవ చూపుతాను'. ఆ ప్రశ్నలకు తగిన ఉత్తరమివ్వగానే ఆ కన్య బిలం తలుపు తెరిచి చూపించే దారి వెంబడి వెళ్ళండి. రెండవ ద్వారం దాటిన వెంటనే జంట వాకిలి కనిపిస్తుంది. అక్కడ దేవతలు మలచిన ప్రతిమవంటి ఒక స్త్రీ వచ్చి, 'అనంత సౌఖ్యానందాల సూక్ష్మం తెలుసుకొన్న మీరు ముక్తి పొందగలరు. మీరు వెళ్ళదలచిన చోటికి మీకెటువంటి కీడు కలుగనటువంటి దారి చూపుతాను' అని చెప్పి ఆ మూడు తీర్థాలకు వెళ్ళే దారి చూపుతుంది. మీరావిధంగానే ఆ మార్గాన పంచాక్షరి, అష్టాక్షరి మంత్రాలను జపిస్తూ వెళ్ళి ఆ మూడు తీర్థాలలో స్నానం చేస్తే మహాతపస్సులు కూడ పొందలేని ఫలం మీకు లభిస్తుంది. అవతలి కొండమీది మాధవుని పాదపద్మాలను సేవించినట్లయితే భవబంధాలన్నీ పటాపంచలైపోయే మహదానందం పొందగలరు. అటు తర్వాత ఆ దారినే మదురై నగరికి వెళ్ళి చేరండి. ఇది బిలమహిమ. మీకు రెండు మార్గాలు చూపాను. ఇవి రెండుగాక మూడవ దారి వెంబడి వెళ్ళాలనుకొంటే అది కూడ మంచి దారే. దారి వెంబడి పూలతోటలున్న ఊళ్ళు కానవస్తాయి. మధ్యమధ్య అడవులు కూడ ఉంటాయి. అవన్నీ దాటుకొని వెళితే మంచి ఆకారమున్న ఒక దేవత మీ దారికడ్డం వస్తుంది. ఆ దేవతను తప్పించుకొని వెళితే, మూడు దారులు కలిసే చోటికి చేరుకొంటారు. అక్కడినుంచి మదురైకి తిన్నగా వెళ్ళవచ్చు.''

అది విని కౌంతి, ''సద్వాక్కులను పల్కిన ఓ వేద విద్వాంసా! విను. బిలాన్ని చూసే కాంక్ష మాకు లేదు. పూర్వజన్మలో చేసిన కర్మఫలాన్ని ఈ జన్మలో మేము చూస్తున్నప్పుడు పుణ్యశరవణ స్నానకాంక్ష కోరనేల? భవతారణితీర్థస్నానమేల ? సత్యార్థులు ఈ ఇలలో పొందగల అర్థమింకేమీ లేదు కాబట్టి ఇష్టసిద్ధి సేవింప పనిలేదు. కాబట్టి మేము దూరపు దారి వెంబడి వెళ్ళుదుము. నీవు ప్రేమించే దైవాన్ని చూసేందుకు నీవెళ్ళు" అని చెప్పింది. ఆ తర్వాత కోవలన్, కన్నగిని వెంట తీసుకొని, ముందుకు వెళుతూ అక్కడక్కడ సేదదీరుతూ ఆ మూడు తోవల్లో మధ్యనున్న దారిన వెళ్ళజూసి, పక్కనున్న దారిన కాస్త దూరం వెళ్ళి అక్కడ కనిపించిన ఒక కొలనులో నీరు తాగగోరి

అటువైపు వెళ్ళింది. అప్పుడు కోవలుని నిజస్వభావం తెలుసుకోగోరి, వసంతమాల రూపంగొని గట్టునున్న కోవలుని సమీపించి కంటనీరు పెట్టుకొని ఇలా అన్నది: 'నేను తిరిగి వెళ్ళి మాధవికి సంగతి తెలియజేసినప్పుడు ,'' నేను రాసిన పత్రమాలికలో పొరబాటు లేదు, నీవు దాన్ని చదివి వినిపించిన తీరులో ఏదో తప్పిదం జరిగి ఉంటుంది" అని చెప్పి వికలమనస్కురాలై తపిస్తూంది మాధవి. తపస్వులను, విద్వాంసులను, విజ్ఞానవంతులను, వివేకవంతులను నొప్పించకూడదు, ఈ వెలయాళ్ళ జీవనం నీచమని చెప్పి తన మెడలోవున్న ముత్యాలహారాన్ని తీసి విసిరేసింది. ఆమె బాధ చూసి ఎలాగైన మిమ్మల్ని వెతికి తెలుసుకోవాలని బాటసారులను అడిగి మీరు మదురైకి వెళుతున్నారని తెలుసుకొన్నాను. ఈ వనదేవత మహిమ వల్ల ఇక్కడికి రాగలిగాను. నేనే ఈ వనచారిణి అని కౌంతికి, మీ సతికి తెలుపకండి' అని చెప్పి అక్కడినుంచి మరుగై, కొలను దగ్గరికి వెళ్ళి, మళ్ళీ నిజరూపందాల్చి ఒక తామరాకు దొన్నెలో నీటిని తెచ్చి కన్నగికిచ్చి సేదదీర్చింది కౌంతి.

తర్వాత ముగ్గురు ఎండ తీవ్రతను గమనించి, గోగు చెట్లు, మరువం, వేపచెట్లు మొదలైన చెట్లున్న ఒక చల్లని తోవను ఎంచుకొని ముందుకు సాగారు. కాసేపటికి ఆ దోవలో వెళ్ళేవారికి నీడనిచ్చే ఒక దేవాలయాన్ని చూసి అప్పటికి అందులో తలదాచుకొన్నారు .

~~~

## వేటరుల ఆటపాటలు

ఆ ఎండలో నడిచి నడిచి కన్నగి మెత్తని పాదాలు కందిపోయి బొబ్బలెక్కగా దారి పక్కన కనిపించిన దుర్గాలయంలో విశ్రాంతి తీసుకొన్నారు.

అప్పుడు ఉన్నట్లుండి పక్కనున్న బోయపల్లెనుంచి శాలిని అనే వదరుబోతు ఆ దేవాలయంలోకి దూరి, పూనకం వచ్చినదానిలాగ తలవిరబోసుకొని, ఆ గుడి లోపలి వేదిక మీదికి దూకి నిల్చొని, "మీరు నాకివ్వాల్సిన మొక్కుబళ్ళివ్వకపోవడం వల్లనే మీ పగవారి పశువుల మందలు బాగ పెరుగుతున్నాయి, మీ మందలు కుంగిపోతున్నాయి. మీకు స్వామ్యమైన దారి దోపిడి కూడ దొరకడం లేదు. మహాధార్మికులకు పుట్టినవాళ్ళలాగ పౌరుషం లేక నిస్సత్తువగా ఉన్నారు. బిచ్చమెత్తుకొని బతకబోతారా?
~~~

విజయులై తలెత్తుకొని బతకాలనుకొంటే నా మొక్కుబడి అప్పు చెల్లించండి!" అనగానే, బోయలు అందుకు సమ్మతించి, పగవారి తలలు ఖండించి తెచ్చి సమర్పించడంకన్న మేలైన ఉపాయం ఆలోచించారు - తమ పైర్లను తవ్వి గుల్ల చేసే అడవి పందులను వేటాడి, వాటి కోరపళ్ళను తీసుకొచ్చారు; వాటితోబాటు తాము వేటాడిన పులి గోళ్ళను, కోరపళ్ళను జతగూర్చి మాల చేసి జింకవాహనం మీద వచ్చే తమ ఇలవేల్పు 'కుమరి'ని అలంకరించారు. తర్వాత తక్కిన అలంకారాలన్నీ పూర్తి చేసి, గంధం, పూలు, బంగారు పొడి, ధూపం, దీపం మొదలైన పూజసామగ్రి, నైవేద్యానికి నువ్వుండలు, కొవ్వుటన్నం పళ్ళేరాల్లో పట్టుకొని వనితలు సిద్ధంగా నిలబడగా కొమ్ముబూరాలు, తప్పెటలు మొదలైన వాయిద్యాలతో ఆటపాటలు మొదలెట్టి 'కుమరి'కి పూజలు చేసి స్తుతించి ఆనందించారు వేటరులు.

అప్పుడు శాలిని కన్నగిని చూసి, 'కొడగు దేశపు లక్ష్మి పడమటి కొండల రాణి కాగల స్త్రీరత్నమని ' పూనకం వచ్చి పలుకగా కన్నగి అది విని విభ్రాంతురాలై తన ప్రాణేశుని వెనక దాక్కొని సిగ్గుపడుతూ తనలో తానే నవ్వుకొంది.

కొప్పులో చంద్రవంక తురుముకొన్నది, రెప్పరార్పక ఉటిమి చూచునది, గరళం మింగి నల్లబారిన కంఠం కలది, చేత వాడి శూలం పట్టినది, నడుమ సింహపు తోలు చుట్టినది, కుడి ఎడమ కాళ్ళకు వీర కడియాలు తొడిగినది, ఎప్పుడూ విజయం, వీరసాఫల్యం చేకూర్చే కత్తిని చేతబట్టినది, మహిషాసురుని తల తొక్కి నిల్చినది, గౌరి, కౌమారి నీలిని, సంపూజ్య శూలిని , ఈశ్వరి అని ఆ బోయభక్తులందరూ స్తుతించగా దేవి వారి పైన కరుణ చూపింది.

శాలిని, వేటరులు కన్నగిని చాల పొగిడారు: 'శివుని అర్ధశరీరాన్ని పంచుకొన్న దుర్గాదేవి ఆభరణాలను తన సొంతం చేసుకొన్న ఈమె దేవి ముందు ఎంతటి తపమాచరించెనో కద! ఈమె వంశాన పుట్టే వేటరుల కులం గొప్ప కులమౌతుంది! దుష్టశిక్షణ, శిష్టరక్షణతో దేవతల పూజలు, ప్రశంసలు అందుకొంటుంది. "

ఆ వేటరులు దేవి మహత్తరమైన అవతారాలైన దుర్గను, కాళిని వేనోళ్ళ పొగడి తామిచ్చే బలులను, దారికొట్టి సంపాదించిన ధనాన్ని, పూజలను అందుకొని దీవించమని వేడుకొన్నారు.

~~~
~~~

## కోటపల్లెకు చేరడం

వేటరుల కుమారి దేవత వేషం తీసివేసిన తర్వాత కోవలన్ పుణ్యవతి కౌంతి పాదాలకు మొక్కి, ''అమ్మా, కన్నగి ఈ మండుటెండలో ఇక నడువలేదు, అడవిమార్గాన కొండలు, గుట్టలెక్కి దిగలేదు. పాండ్యభూపతి పరిపాలనన్లో బెబ్బులులు తరమని, మొసళ్ళు పట్టుకోనటువంటి దేశంలో చల్లని వెన్నెలరేయి ప్రయాణం చేయడమే మేలు కన్నగికి" అని వేడుకోగా కౌంతి అందుకు సమ్మతించింది.

అలాగే వారు రాత్రిపూట కౌంతి ఉపదేశవాక్కులు వింటూ, కోవలన్ కన్నగి చేతులను తన భుజకీర్తులమీద పెట్టుకొని అడవిమార్గానే నిర్భయంగా ప్రయాణం సాగించి పొద్దు పొడిచి కోడి కొక్కొరొకో అని కూసే వేళకు వైదికాచారాలను అంతగా పాటించని విప్రులు నివసించే ఒక ఊరికి చేరుకొన్నారు. కోవలన్ తక్కిన ఇద్దరినీ ఒకచోట పెట్టి కొలను వెతుక్కొంటూ వెళ్ళాడు.

అప్పుడా కొలను గట్టున ఒక వటుడు(బ్రాహ్మణబాలకుడు) కూర్చొని ఉండడాన్ని, ఆ వటుడు 'ఓ మాధవీ! ప్రియుడు నిన్ను విడిచివెళ్ళిన తర్వాత నీవెలా ఉన్నావో కద! నీకే ఆపదా రాలేదు కద?' అని తనలో తాను మెల్లగా మాట్లాడుకోవడాన్ని ఒక పొద పక్కన నిలబడి విన్న కోవలన్ ఆ వటుని దగ్గరికి వెళ్ళి, తానెవరో పరిచయం చేసుకొని, తానాడిన మాటల భావమేమని అడిగాడు. అప్పుడా బ్రాహ్మణబాలకుడు సందేహం వీడి, సంగతులిలా తెలియజేశాడు - కోవలన్ ఊరు వదిలి వెళ్ళిన తర్వాత తన తల్లిదండ్రులు మణిని వీడిన సర్పంలాగ ప్రాణమున్నా లేనట్లు నిర్జీవులై, తమ సేవకులను దేశమంతా వెతికి తమ కుమారుని తీసుకొని రమ్మని పంపడం, తన చెలికత్తె మూలంగా కోవలన్ తన శ్రీముఖాన్ని (ఉత్తరాన్ని) అనాదరించిన విషయం తెలుసుకొని కొండంత విచారంతో తన మేడలో మాధవి అలిగి పడుకొని ఉండడాన్ని, ఆ తర్వాత తానామెను చూడవెళ్ళగా, తన హృదయేశ్వరుని ఎలాగైన వెతికి పిలుచుకొని రమ్మని వేడుకోవడం, ఇంకొక ఉత్తరాన్ని రాసి తన ముద్రవేసి తనకప్పగించిన విషయాన్ని వివరించాడా వటుడు. ఆ తర్వాత మాధవి ఇచ్చిన ఉత్తరాన్ని కోవలన్ చేతికందించాడు. ఆ ఉత్తరాన్ని తీసుకొని మాధవి మృత్తిక ముద్రను చూడగానే పాత జ్ఞాపకాలు గుర్తుకొచ్చి కదిలిపోయాడు కోవలన్. ఉత్తరాన్ని శ్రద్ధగా చదివాడు.

తర్వాత కౌశికుడనే ఆ వటుని చూసి, "పెద్దల పాదపద్మాలకు నా నమస్సులు. ఎవరికీ చెప్పక కన్నగితో నడిరేయి బయల్దేరి వచ్చేసిన నా మూర్ఖత్వాన్ని ఏమనాలి? నేనిప్పుడు రాసి ఇచ్చే ఉత్తరాన్ని వెంటనే తీసుకొని నా తలిదండ్రుల వద్దకు వెళ్ళి వారి పాదపద్మాలకు నా నమస్సులు నివేదించి నా ఈ పత్రాన్ని ఇవ్వమని వేడుకొంటున్నాను." అని చెప్పి తన తలిదండ్రులకు తాను వీలైనంత త్వరలో తిరిగి వస్తానని ఉత్తరం రాసి ఆ వటుని చేతికిచ్చి అతన్ని సాగనంపి, కన్నగి, కౌంతి విశ్రమిస్తున్న చోటికి మరలాడు కోవలన్.

ఆ ఆలయంలో దుర్గాదేవి సమక్షాన పాడుతున్న గాయకులతో చేరి, ఏడు తంత్రులున్న వీణను ఎంచుకొని, శ్రుతి సవరించి, స్వరమేళనంలో మూడు, నాల్గవ స్వరాలను ఎంచుకొని, అందుకు తగినట్లు మధ్యమ శ్రుతిని ఎంచుకొని సంపూర్ణ రాగాలను, అసంపూర్ణరాగాలను వాయిస్తూ, వీణానాదంతోబాటు పాటలు పాడుతూ వారితో కాసేపు కాలం గడిపాడు కోవలన్.

పిదప కోవలన్ ఆ గాయకులను మదురై ఇంకెన్ని ఆమడల దూరాన ఉన్నదని అడిగాడు. అందుకు వారు, 'ఓ పుణ్యాత్మా! మదురై ఇక్కడికెంతో దూరం లేదు. సుసంపన్నమైన పాండ్యరాజ్యంలో మీరు వెళ్ళే దారి పొడుగునా సంపంగి, మల్లె తోటలు, ఉద్యానవనాలు కానవస్తాయి. ఊళ్ళలో ఆలయాలనుంచి అగరు పొగలు, ఇళ్ళనుంచి తాళింపు ఘుమఘుమలు మిమ్మల్ని ఆహ్వానిస్తాయి. అతివలకు ఎటువంటి ఆపద, హాని కూడ కలుగదు. దారి కూడ సుగమమే. ధైర్యంగా వెళ్ళిరండి' అని చెప్పి సాగనంపారు.

అలాగే కోవలన్, కన్నగి, కౌంతి మునుపటిలాగే రాత్రిపూట ప్రయాణం కొనసాగించి, పొద్దు పొడిచే సమయానికి రాచనగరులో సర్వలోకేశ్వరుని ఆలయాన సంగీతకారులు సన్నాయితోను, విప్రులు ప్రాతఃకాల మంత్రాలతోను మేల్కొలిపే ముహూర్తానికి మదురై నగరం పొలిమేరలకు చేరుకొన్నారు. అదే సమయాన నిత్యవిజయుడైన పాండ్యుని సేవకులు, వీరభటుల జయజయ ధ్వానాలు, గజాశ్వశ్రేణుల నాదాలు కూడ వినవచ్చాయి. పొలాల్లో కాపులు పాడే పాటలు వింటూ, బిరబిరా పారే సెలయేళ్ళను దాటుకొంటూ, విరబూసిన పారిజాతం, చంపకం, పున్నాగ చెట్లను చూసి ఆనందిస్తూ ముందుకు సాగి వైగై నదీతీరం చేరుకొన్నారు. అక్కడ శార్దూల ముఖ,

గజముఖ, సింహముఖ, హయముఖ చిహ్నాలున్న నౌకను ఎక్కక, ఒక చిన్న పడవెక్కి అవతలి గట్టుకు చేరుకొన్నారు.

తర్వాత మదురై నగరం చుట్టూ ఉన్న శత్రుభయంకరమైన కోట గోడ, అగడ్త, ఆ అగడ్తలో విరబూసిన కలువలు, తామరలు చూసి అచ్చెరువొంది నిలిచారు. చుట్టూ ఉన్న పూలతోటలో కాసేపు సేదదీరి, మునులు మాత్రమే నివసించే పురానికి పక్కనున్న కోటపల్లె అనే ఒక చిన్నపల్లెలోకి వెళ్ళారు కౌంతి, కోవలన్, కన్నగి.

~~~
~~~

## పుర సందర్శనం

కోటపల్లె చుట్టూ ఉన్న తోటల్లో, చెట్లలో, కొలనుల్లో , వెన్నులు వంగిన వరిమళ్ళలో విహరిస్తూ కిలకిలారావాలు చేస్తున్న పక్షులను చూసి ఆనందిస్తూ పాండ్యరాజు పురంలోని లోకేశ్వర దేవాలయాన్ని , విష్ణు ఆలయాన్ని , షణ్ముఖుని ఆలయాన్ని , బలరాముని ఆలయాన్ని సందర్శించుకొన్నారు . ఆ తర్వాత ప్రభువు మందిరానికి వెళ్ళి అక్కడ ధ్యాననిమగ్నురాలై ఉన్న స్వామినికి మౌనంగా వందనమొనర్చి ఇక ముందు చేయవలసిన కార్యం గురించి ఆలోచించారు. కోవలన్ అప్పుడు కౌంతికి నమస్కరించి, 'బుద్ధిహీనుడనై దారి తప్పి సర్వం కోల్పోయి ఈ దైన్యస్థితికి చేరుకొన్న నేను ఈ కొత్తనాడుకు వెళ్ళి నా దుస్థితిని ఈ పురవ్యాపారులకు చెప్పి తిరిగి వచ్చేవరకు నా సతిని నీ సంరక్షణలో చూసుకొమ్మ 'ని వేడుకొన్నాడు. అప్పుడు కౌంతి, 'నీ మీద ఎంతో ప్రేమ ఉన్న నీ భార్యను వదిలి పెడతోవను వెళ్ళావు. ఆ తోవ వదిలి ధర్మమార్గానికి రాకుంటివేని తీరని అగచాట్లు కలుగున'ని మంచిమాటలు చెప్పింది. పూర్వం ధర్మజ్ఞులు చెప్పిన మంచిమాటలను వినక పెడతోవ పట్టి అనేక కష్టాలు పడ్డవారి ఉదాహరణలు- జూదంలో రాజ్యాన్ని కోల్పోయి అష్టకష్టాలు పడ్డ నలుని కథ, పాండవుల కథ - వివరించి చెప్పింది కౌంతి. 'కానీ నీవు అటువంటి వాడివి కావు, నీవు నీ సతిని విడిచి వెళ్ళినప్పటికీ మళ్ళీ నీ తప్పు గ్రహించి తిరిగి వచ్చి నీ సతితో కొత్త జీవితాన్ని ప్రారంభించేందుకు ఈ పట్టణానికి వచ్చావు. ఈ పట్టణాన అతిథులను ఎరిగి మర్యాదలు చేసేవారలుంటే చూసి రమ్మ 'ని చెప్పి కోవలుని పంపింది కౌంతి.

అలాగే కోవలన్ కోటను సమీపించి అగడ్తను అందరితోబాటు దాటి కోట వాకిలి చేరి, అక్కడ కాపలా ఉన్న యవనవీరులకు ఏమాత్రం సందేహం కలగనట్లు నడుచుకొని ఆ బ్రహ్మాండమైన కోటలో ప్రవేశించాడు.

ఆ పురవీధుల్లో స్త్రీలు చక్కగా అలంకరించుకొని, మొల్లలు, మెట్ట తామరలు, కలువలు మొదలైన పూలను కొప్పుల్లో తురుముకొని అక్కడి ఉద్యానవనాల్లో తమ ప్రియులతో ప్రేమవిహారం చేస్తుండడం, సంపన్నుల ఇళ్ళలోని చంద్రశాలల్లో వారు వెన్నెలను చవి చూసి ఆనందిస్తుడడం అతనికి మరింత ఉత్సాహాన్ని కలిగించింది. అప్పుడు హేమంత ఋతువు - తోటల్లోని వివిధ సుగంధ పుష్పాల పరిమళాలను

మోసుకొని వస్తున్న తూరుపుగాలి మత్తెక్కిస్తుండగా నవదంపతులు సరససల్లాపాలలో లీనమై మైమరచిపోతున్నవేళ. ప్రభువుల ఆశీస్సులతో పడుచుల పెళ్ళిళ్ళు వైభవంగా జరుగుతున్నాయి. ఇటుకలు నెత్తికెక్కనీక [14]భూపతులు గౌరవంగా జీవించగోరుకొనే వీధులున్న వాడలు, నాలుగు విధాలైన అభినయ పద్ధతుల్లోను [15], స్వరపద్ధతుల్లోను , పల్లవి-చరణాలను సుమధురంగా పాడడంలోను నిష్ణాతులై, తపస్వులను కూడ తమ చుట్టు భ్రమరాల్లాగ తిప్పించుకోగల చాతుర్యమున్న వెలయాళ్ళున వాడలు, కవచాలు, కత్తులు, డాళ్ళు, వింజామరలు, తేర్లకు కావలసిన తాళ్ళు, అంకుశాలు, లోహపు కోలలు, లోహపు పాశాలు, దంతంతో చేసిన దువ్వెనలు మొదలైన వస్తువులమ్మే వీధులు, ఎలాంటి దోషాల్లేక స్వచ్ఛమైన కాంతులీనే వజ్రాలు, పసిమిచాయల మరకతాలు, పౌరపొచ్చాల్లేని కురువిందాలు (మాణిక్యాలు), నీలరత్నాలు, గోమేధిక పుష్యరాగాలు , తేనెవన్నెల వైఢూర్యాలు, చంద్రుని గురువైన శుక్రుని [16]వన్నెగల ఆణిముత్యాలు, ఎటువంటి దోషాల్లేని తీగ పగడాలు, వీటన్నిటి లక్షణాలు క్షుణ్ణంగా ఎరిగిన వ్యాపారులు శత్రు, చోరభయమిసుమంతైన లేక తమ అంగళ్ళలో వీటిని అమ్ముతున్న వీధులు, నాలుగు విధాలైన బంగారపు గుర్తులెరిగిన వర్తకులున్న వీధులు, పట్టు, నూలు, ఉన్ని వస్త్రాలు నేసి పేర్చి పెట్టిన వీధులు, ధాన్యశాలలున్న వీధులు, బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రజాతుల వాడలు, నాలుగు వీధుల కూడళ్ళు - వీటన్నిటినీ మిట్టమధ్యాహ్నపుటెండ కూడ చొరని చల్లని పందిళ్ళ నీడన నడుస్తూ ఆ పాండ్యరాజు పురాన్ని చూసి ఆనందించి తన విడిదికి మరలాడు కోవలన్.

~~~

14 వ్యభిచరించిన వారి నెత్తిమీద ఏడు కాలిన ఇటుకలుంచి ఊరు తిప్పించడం ఆ రాజ్యంలో ఆ కాలంలో విధించే శిక్ష.

15 నిలుచుట (నిట్రల్), కదలిక (ఇయంగల్), హస్తక్రియ (ఇరుత్తల్), ఉనికి (కిడత్తల్). (సాత్వికాంగిక వాచికాహార్యములు కావు)

16 చంద్రుని గురువు శుక్రాచార్యుడని వ్యాఖ్య
~~~

## ఇల్లడ [17]

పుడమికి సకలభాగ్యాలొసగే కరుణామయుడైన దేవుని ఆజ్ఞలను సక్రమంగా పాటించే పాండ్యరాజు పాలిస్తున్న ఆ రాజ్యంలోని విశేషాలను, ప్రజల నెమ్మదిని నిదానంగా పరికించి చూస్తూ కోట బయటికొచ్చి మునులు నివసించే పూదోటకు చేరుకొన్న కోవలన్ తాను చూసిన విశేషాలను, మదురై సౌందర్యాన్ని, వైభవాన్ని కౌంతికి వివరిస్తుండగా, సముద్రమంతటి అగడ్తకు అవతల చెంగాడనే ఊరిలో నివసించే మాడలుడనే ఒక వేదపారంగతుడు, సచ్ఛీలుడు, లలితవాక్యుడక్కడికేతెంచి, మలయ పర్వతాన్ని (హిమాలయం) దర్శించి, కుమరి తీర్థంలో స్నానించి స్వస్థలానికి వెళుతుండగా ఆ పూలతోటకు కౌంతి విచ్చేసిన విషయం తెలిసి అక్కడికి వచ్చానని తెలిపాడు. అతనికెదురేగి మొక్కిన కోవలుని చూసి మాడలుడు, మాధవి జీవిత వృత్తాంతాన్ని, కోవలుని పూర్వజన్మ వృత్తాంతాన్ని ఇలా చెప్పుకొచ్చాడు: "ఓ సుగుణమూర్తీ! రాజు చేత ప్రశంసలందుకొన్న మాధవి పుట్టినప్పుడు, ముదుసలి వేశ్యలు ప్రసవగృహానికరుదెంచి, ఆమెకు చాల అరుదైన పేరు పెడతామని చెప్పగా, అది విని నీవు, నిన్ను గతజన్మలో ఒకప్పుడు రాక్షసుల హింస నుంచి కాపాడిన మణిమేఖల మహిమాన్విత నామాన్ని ఈ బిడ్డకు పెట్టడం ఉచితమని చెప్పగా, అది విని ఆ ముదుసలి వేశ్యలు సంతసించి ఆ బిడ్డకు మాధవి అనే పేరుపెట్టి దీవించారు.

"మహారాజు వద్ద సువర్ణదానం పొందుదామని ఆతురతతో ఊతకర్రసాయంతో వెళుతున్న ఒక ముసలి బ్రాహ్మణుని హఠాత్తుగా ఒక మదపుటేనుగు తన తొండంతో పట్టి పైకెత్తి విసిరికొట్టబోవగా, అది చూసి ఆ మదపుటేనుగు పైకి దూకి, దాని మదమణచి, దాని తొండంనుంచి బ్రాహ్మణుని విడిపించి కాపాడిన దయావీరుడివి నీవు!

"అంతే కాదు, పసిబిడ్డను పాము నుంచి కాపాడిన ముంగిసను అనుమానించి చంపిన కాంత పాపాన్ని పోగొట్టడానికి ఆమె భర్త గంగాస్నానానికి బయల్దేరగా, ఆమె కూడ వెంట వస్తానని పట్టుబట్టినప్పుడు, 'నీ చేతి కూడు నేను తిన

17 పదిలపఱచిపెట్టి అడిగినప్పుడు ఇమ్మని యేదేని యొక వస్తువును ఒకరి వద్ద దాఁచుట

తగదని' ఆమె భర్త చెప్పి, ఒక తాటాకు మీద ఒక పద్యం రాసి, దీన్ని ఎవరు చదివి అర్థం చేసుకొంటారో వారే నీకు పాపపరిహారం చేస్తారని చెప్పగా, ఆమె ఆ పద్యాన్ని ఇంటింటికీ వెళ్ళి చూపిస్తుండగా, చివరికి ఆమె నిన్ను దర్శించి ఆ పద్యాన్ని నీకివ్వగా, నీవు దాన్ని చదివి, అందులో చెప్పిన విధంగా తగిన దానాలు చేసి ఆమె పాపాన్ని పోగొట్టడమేగాక, నీ మనుషులను పంపి, అడవి దారి పట్టి వెళ్ళిన ఆమె భర్తను వెతికి తెప్పించి, మళ్ళీ వారికి అనేక సంపదలిచ్చి వారి ఇల్లు నిలబెట్టిన దయామయుడివి నీవు!

"నేనెరిగిన వరకు నీవు ఈ జన్మలో చేసిన సుకృతాలు మాత్రమేగాక మహాపుణ్యవతి కల్కి (కౌంతి)తో ఇలా రావడం నీ పూర్వజన్మ సుకృతం కాదా?" అని మాడలుడనగా, అందుకు కోవలన్, "అయ్యా! తొలిజామున ఒక పీడ కల కన్నాను - కన్నగి ఈ పాండ్యుని పురంలో ఒక అల్పుని వలన దుఃఖసాగరంలో మునిగి, కన్నీరు మున్నీరుగా ఏడుస్తుండగా, నేను సర్వం కోల్పోయి ఒక పంది మీద వెళుతున్నట్లు, మాధవి మణిమేఖలను తీసుకొని వెళ్ళి బోధివృక్షం కింద బుద్ధునికిచ్చి వెళ్ళినట్లు, ఇంకా ఏవేవో అపశకున సంఘటనలు చూశానా కలలో. ఏది దారి?" అని వేడుకొనగా, అందుకు మాడలుడు, కౌంతి, "నీవు నీ భార్యతో సూర్యుడస్తమించే లోపు కోట వాకిలి దాటి నగరప్రవేశం చేయడం చాల ఉత్తమం, నీ యశస్సు విని ఈ పుర వణిజులు ఎదురొచ్చి నిన్ను పిలుచుకొని వెళతార"ని చెబుతుండగా, ఆ కోట వాకిలి వెలుపల వెలసిన స్త్రీదేవతకు క్షీరం (పాలు) అర్పించేందుకు మాదరి అనే ఒక వృద్ధ గొల్లవనిత రాగా, ఆమెను చూసి కౌంతి కోవలునితో, "ఈ వృద్ధురాలు చాల సుగుణవతి, ఈమె ఇంట కన్నగిని ఉంచడం చాల సమంజసం" అని చెప్పి, ఆ వృద్ధ గొల్లరాలితో కన్నగిని తన ఇంటికి తీసుకొని వెళ్ళి జాగ్రత్తగా అన్ని వసతులతో, కోవలన్ తిరిగి వచ్చేవరకు చూసుకొమ్మని కన్నగిని ఆమెకు అప్పజెప్పింది (=ఇల్లడ).

కౌంతి ఆ వృద్ధురాలికి కన్నగి గురించి ఇంకా ఇలా చెప్పింది: "ఈమె మహాపతివ్రత, ఇటువంటి పుణ్యసతులున్న రాజ్యం పాడిపంటలతో సుభిక్షంగా ఉంటుంది, సత్యం, ధర్మం సదా పాటింపబడతాయి. కాబట్టి ఇటువంటి మహాపతివ్రతను భద్రంగా కాపాడడం నీకు మహదానందం కలుగజేస్తుంది. దానఫలం ఏ విధంగా మోక్షాన్నిస్తుందో అదే విధంగా నావంటి తపస్వినులు ఒప్పజెప్పిన ఇటువంటి కార్యాన్ని, అంటే ఈ

సత్శీలవతిని ఆమె భర్త నగరం నుంచి తిరిగి వచ్చేవరకు భద్రంగా చూసుకొంటే నీకు చాల పుణ్యం కలుగుతుంది". అది విని ఆ వృద్ధ గొల్లవనిత చాల సంతసించి, సూర్యుని వేడి తగ్గిన వేళ, పాడి ఆవులు, లేగ దూడలు, గొర్రెలు వెంట రాగా, సిగ్గుల మొగ్గ కన్నగిని తన వెంట తీసుకొని , అటూ ఇటూ కొందరు ఈ అమ్మాయి ఈ ఊరికి కొత్తా అని అడుగుతుండగా వారికి ఉత్తరమిస్తూ, కోట చుట్టూ ఉన్న అగడ్త, కోట పరిరక్షణకు సిద్ధంగా అమర్చిన యంత్ర ధనుస్సులు, వడిసెలలు, రాగి కరగబెట్టే కొలుములు, కుంపటులు, రాళ్ళ గంపలు, పెద్ద గొలుసులు, గడియ మాకులు, కరకు శూలాలు, గోడల మీద పొదిగే శూలాలు, వెదురు కర్రలు, ఈటెలు, కుంతాలు మొదలైన రక్షణాసామగ్రిని, విజయ ధ్వజాలలరే కోట వాకిలిని దాటుకొని వెళ్ళి కన్నగితో తన ఇంటికి క్షేమంగా చేరింది.

~~~
~~~

## కోవలుని వధ

**కన్నగిని** ఇల్లడముగా గొన్న గొల్ల వనిత తన ఇంట తక్కిన ఆడవాళ్ళతో ఆమెను బస చేయించడానికి మనసు రాక, చల్లని నీడనున్న ఒక అందమైన పూరింట ఆమెకు వసతులు కల్పించి తన ఇంటివారితో సహజ సుందరాంగి కన్నగికి గోరు వెచ్చని నీటితో స్నానం చేయించి ఆమెకు సేవలు చేసేందుకు తన కుమార్తెను నియమించింది. ఆ తర్వాత కన్నగితో, ''తపస్వి కౌంతి మార్గాయాసం తెలియనట్లు మంచి దారిలో మిమ్మల్ని ఇక్కడికి తీసుకొని వచ్చి చేర్చింది గనుక, నీ భర్తకు ఇంకే చింత లేదు. మీరు శ్రావక వ్రతం పాటించేవారు కాబట్టి ఇప్పుడే వంట మొదలు పెట్టడం మంచిది" అని చెప్పి తన గొల్ల పడుచులకు కోవలన్, కన్నగికి తగిన వంట చేసేందుకు వంకాయ, చిక్కుడు, బీర మొదలైన కూరగాయలు, పాలు, నేయి, బియ్యం కొని తెమ్మని పురమాయించింది.

అలాగే కన్నగి పొయ్యి ముట్టించి గొల్లవనిత నియమించిన చెలికత్తె సాయంతో వంట చేసి మగనికి తాటి చాప వేసి, మట్టిపాత్రలో నీరు తీసుకొని కాళ్ళు కడిగి, అరిటాకు వేసి తాను వండిన వంటకాలు వడ్డించగా, కోవలన్ తృప్తిగా ఆరగించి విశ్రాంతి తీసుకొన్నాడు. కన్నగి అప్పుడతనికి భక్తితో తాంబూలమివ్వగా అది తీసుకొని కోవలన్, ''కన్నగి! నీ మృదువైన పాదాలు ఇంత కష్టపడవచ్చా? మన తలిదండ్రులు మన గురించి ఎంతగా విచారిస్తుంటారో కద? చెడుస్నేహితుల మాటలు విని పెడదారి పట్టి, సత్యధర్మాలను వీడి మన వంశానికి అపకీర్తి తెచ్చాను కద? అటువంటి నాకు ఇక సద్గతి కలగడం కలలో మాటే! నాతో రావద్దంటే వస్తానని పట్టుబట్టి నాతో వచ్చావు, ఇన్ని కష్టాలు పడుతున్నావిప్పుడు. నేనేం చేయను?'' అని వాపోగా, అందుకు కన్నగి, ''నాథా! మిమ్మల్ని ఎడబాసిన మీ తలిదండ్రులు తమ దుఃఖాన్ని దిగమింగుకొని, చిరునవ్వుతో నాతో చాల ప్రియంగా మాట్లాడినరీతి చూసి, మిమ్మల్ని వీడి ఉండకూడదని స్థిరచిత్తంతో మీ వెంట వచ్చేందుకు నిశ్చయించాను" అన్నది.

అది విని కదిలిపోయిన కోవలన్, ''తలిదండ్రులను, పెద్దలను వీడి నాతో కష్టసుఖాలు పంచుకోవడానికి వచ్చిన నా గృహదీపమా! నీ కాలి అందె అమ్మి ధనం తీసుకొచ్చి మళ్ళీ మనం పూర్వంలాగ జీవితం గడిపేందుకు మార్గం చూస్తా"నని చెప్పి, ఆమె ఒక కాలి అందె తీసుకొని, దాసీజనం లేక సాధారణ జీవితం గడుపుతున్న తన

ప్రియసఖి స్థితికి విచారిస్తూ నగరానికి బయల్దేరాడు కోవలన్.

దేవదాసీలు, ఇతర దాసీజనాలు నివసించే వీధులు దాటి కంసాలి వీధిలో ప్రవేశించిన కోవలన్ వెంబడి నూరుగురు కంసాళ్ళు రాగా, వారందరిని పట్టించుకోక, రాజగౌరవానికి పాత్రుడైన కంసాలి అని తోచిన ఒక కంసాలి అంగడిలో ప్రవేశించి, 'పాండ్యరాజు సతికి తగిన కాలి అందె నాదగ్గరుంది, చూసి వెలకట్టి చెప్పగలవా?' అని అడగగానే, యమదూతగా వచ్చిన ఆ కపటి కంసాలి, 'ప్రభువుకు వెల కట్టలేని ఆభరణాలను నేను చేస్తుంటాను' అని విర్రవీగాడు. వెంటనే అతని మాటలు నమ్మి, కోవలన్ తన నడుం బట్ట విప్పి వజ్రవైఢూర్యాలు, మాణిక్యాలు పొదిగిన అపరంజి అందెను ఆ కంసాలికి అందించాడు. దాన్ని చేతికి తీసుకొని పరీక్షించగానే, ఇది తాను [18]పార్థివుని పత్ని కాలి అందెలాగుంది కద , ఆ అందెను అపహరించిన నేరాన్ని వీడి మీద మోపి తాను తప్పించుకోవచ్చని ఒక దురుపాయం పన్ని, కోవలన్ని చూసి, 'ఈ అమూల్యమైన కాలియందె రాజపత్ని తప్ప తక్కినవారికి తగదు, వెంటనే రాజుకు చూపించి వస్తాను, అంతవరకు నా ఈ గుడిసెలో ఉండ'మని చెప్పగా, కోవలన్ అమాయకంగా ఆ కపట కంసాలి ఇంటి లోపలికి వెళ్ళగానే ఆ కంసాలి తన దొంగతనం ప్రజలకు తెలిసే ముందు ఇతన్ని ఇరికించి తాను తప్పించుకోవాలని బిరబిర రాజప్రాసాదం వైపు వెళ్ళాడు. అదే సమయాన తన నాథుడు చదరంగంలో మునిగి తనని మరిచిపోయాడని అలిగి, తల నొప్పి అన్న నెపంతో అంతఃపురానికి రాజపత్ని వెళ్ళగా, అది విని మంత్రి కూటమికి వెళ్ళక సతీమణి అలక తీర్చేందుకు అంతఃపురం వైపు వెళుతున్న రాజును చూసి వెంటనే అతనికెదురేగి సాగిలబడి , 'ప్రభూ! రక్షకభటులు, ద్వారపాలకుల కంట మట్టిగొట్టి రాజపత్ని కాలియందె తస్కరించిన గజదొంగ దొరికాడు, రక్షకభటులను వెంటనే నా గుడిసెకు పంపించండి!' అనగానే, భోగాలం దాపురించిన ఆ పాండ్యవిభుడు ఏ మాత్రం ఆలోచించక , తన రక్షకభటనాయకుని చూసి, ' దేవి కాలియందె అపహరించిన దొంగ ఈ కంసాలి చూపిన చోట ఉంటే వాడిని వెంటనే వధించి ఆ అందెను తెమ్మ'ని ఆజ్ఞాపించగా, ఆ కపటి కంసాలి లోలోపలే సంతోషపడి ఆ రక్షకభటులను వెంట తీసుకొని తన

18 పార్థివుడు = రాజు, ఱేడు

ఇంటివైపు వడివడిగా వెళ్ళాడు.

తన ఇంటి లోపలున్న కోవలునికి రాజభటులను చూపించి వీరే రాజసభనుంచి కాలిఅందె చూసి వెల కట్టేందుకు వచ్చినవారని, వారికి కోవలుని దగ్గరున్న కాలిఅందె చూపింపజేసి, ఆ తర్వాత వారిని దూరంగా పిల్చుకొని వెళ్ళి, ఇతడే రాజపత్ని కాలియందె అపహరించిన గజదొంగ అని వారిని నమ్మింపజూశాడు. వారు కోవలుని దూరంనుంచి మరొకసారి తేరిపారజూసి, ఉన్నతకుల లక్షణాలున్న ఈ పురుషుడు దొంగ కాజాలడు, వధ్యుడు[19]కాడు అని సందేహం వెలిబుచ్చగా, అందుకు ఆ కపటి కంసాలి ముసినవ్వుతో, చోరకళలో నిష్ణాతులైనవారు ఇలాగే పెద్ద మనుషుల్లాగ కనిపిస్తారని, వారి వేషభాషలు చూసి మోసపోరాదని, ఇలాంటి దొంగే ఒకసారి రక్షకభటుల మీద మత్తుమందుజల్లి రాణివాసంలో ప్రవేశించి చిన్న యువరాజు మెడలోని హారాన్ని అపహరింజూశాడని, యువరాజు అడ్డుకోజూసినా, తన చోరకళానైపుణ్యంతో తప్పించుకొని పారిపోయాడని, కాబట్టి ఈ కొత్త వాడిని కూడ నమ్మకూడదని నొక్కి చెప్పాడు. అప్పుడు ఆ వచ్చిన రక్షకభటుల్లో ఒకడు తాను కూడ ఇలాగే ఒకసారి మోసపోయానని, ఇప్పుడు వీడిని విడిచిపెట్టి వెళితే రాజదండన తప్పదని చెబుతూనే, ఒరనుంచి కత్తిని సర్రునదూసి, ఒక్కవేటుతో కోవలుని తల నరికేశాడు.

కోవలుని తెగిన కంఠంనుంచి చివ్వున రక్తం జిమ్మి, భూమి తడిసి రక్తసిక్తమైంది. భూమాత వగచింది. పూర్వజన్మ దుష్కృతాలకు ఈ జన్మలో కోవలన్ శిక్ష అనుభవించాడు.

~~~

---

19 వధ్యుడు = చంపదగినవాడు
~~~

## గొల్లవారి ఆటపాటలు

తన తోటి గొల్లభామలతోను, తన కుమార్తె ఆర్యతోను వెన్న చిలుకుతున్న గొల్ల ముదుసలి మాదరి ఉన్నట్లుండి చాల దుశ్శకునాలను గమనించింది - కడవలో పెరుగు చిలుకుతున్నా వెన్న రావడం లేదు, ఆవులన్నీ ఉత్సాహంగా అటూ ఇటూ తిరుగుతూ ఉండక, కన్నీరు కారుస్తున్నాయి, తుళ్ళుతూ గెంతుతూ ఆటలాడుతుండే మేకలు ముడుచుకొని పడుకొనివున్నాయి. ఇదంతా చూసి, మాదరి తన కూతురితో 'ఏదో చెడు వార్త వినబోతున్నాము లాగుంది. కానీ భయపడకు. కాంతలకు శిరోమణి అని చెప్పదగ్గ కన్నగి చూసి ఆనందించేలాగ తొలుత శ్రీకృష్ణుడు బలరామునితో ఆడిన ఆటలాడుదాం' అన్నది.

శ్రావ్యంగా ఛందోబద్ధంగా ఉండే ఆ పాటలు విన చాల సొంపుగాను, ఉత్సాహకరంగాను ఉన్నాయి. ఒక పద్య మాల (ద్విపదలాంటిది) 'మా నీల ... అలాంటివాడిని వలచుతుంది(ప్రేమిస్తుంది)' అని సాగుతుంది. క్లుప్తంగా:

"కారెద్దు కోపానికి జడవక దాన్ని వడిసిపట్టి
పొగరణచిన వాడిని వలచు మా నీల" |
"ఈ బలిష్టమైన ఎద్దుమీదెక్కి స్వారి
చేయువానికి స్వామ్యమగును మా నీల" |
...
"పొగరెక్కిన కోడి మదమణచిన
వానికి అర్ధాంగియగు మా నీల" |
"అందమైన కోడిని బేరమాడక
కొనగల దిట్టకు తగును మా నీల" |
"ఎవని వైపు ఈ గిత్త నడచునో
వాడికే దక్కుతుంది మా నీల" |
"ఎగిరెగిరిపడే కోడిపుంజు కొవ్వు
అణచేవాడికే వరణీయమగు మా పూబోణి"

ఇలా ఏడు కోడె గిత్తలను తమ పెండ్లి కోసం పెంచారట ఏడుగురు

పూబోణులని తన కూతురికి చెబుతుంది మాదరి. ఆ తర్వాత ఆ ఏడుగురిని (ఆ కోడెల మదమణచిన మగధీరులను) షడ్జం మొదలుకొని నిషాదంవరకు సప్తస్వర క్రమంలో నిలుపమని చెప్పగా, వారిలా నిలిచారట - షడ్జంలో కృష్ణుడు నిలువగా పంచమస్వరంలో అతని అన్న బలరాముడు నిలిచాడట.[20] వారు ఆటలాడుతూండగా పంచమ స్వరం నీల వృషభమైంది, కృష్ణుడు, బలరాముడు చోటు మారి నిషాద గాంధార స్వర స్థానాలకు వెళ్ళారు. ఇలా సాగింది వారి శాస్త్రబద్ధమైన ఆట. ఆటతోబాటు స్వరబద్ధమైన పాట కూడ పాడసాగారు - షడ్జమం మంద్రస్వరంగాను, పంచమస్వరం మధ్యమంగాను, వృషభం ఉచ్ఛస్థాయి స్వరంగాను సాగింది వారి ఆటతో కూడిన పాట.

[అడవి, అడవి చుట్టుపక్కల ప్రాంతాలను తమిళంలో 'ముల్లై' అంటారు. దానికధిదేవత విష్ణువు. గొల్లల ఆటను కూడ 'ముల్లై' అంటారు. దానికి పంచమం శ్రుతి అవుతుంది. దానికైదవదైన మిత్ర స్వరం నీళ (విష్ణువు భార్యలలో ఒకతె).]

వీరు గొల్లలు కాబట్టి వీరికి కృష్ణుడంటే చాల ప్రీతి - అతని అందచందాలను, వీరశౌర్యాలను, దుష్టులను శిక్షించి శిష్టులను రక్షించే అతని గొప్పతనాన్ని, గొల్లభామల వలువలపహరించేటటువంటి తుంటరి చేష్టలను పొగడుతూ, మరిన్ని పాటలు పాడి సంతసించారు.

మరిన్ని పాటలు పాండ్యరాజును పొగడుతూ పాడారు - ఇంద్రుని వద్ద బహుమతిగా పొందిన హారం గురించి, హిమగిరి మీద పులి చిత్రాన్ని చిత్రించి , దానికి దక్షిణంగా ఉన్న భూమినంతటినీ ఏలే విభుడని పొగడే పాటలు/పద్యాలు మరిన్ని.

అటువంటి కన్నయ్య మన మందలను ఆపదలనుంచి కాపాడుతాడని, శత్రుభయంకరుడైన పాండ్యరాజు తమను శత్రువుల నుంచి కాపాడుతాడని కోరుతూ తమ

---

20 వృషభ సింహ కటక తులా ధనుః కుంభ మీనాలను షడ్జాది సప్తస్వర క్రమంలో నిలపడం ఒక పద్ధతి. తులా ధనుః కుంభ మీన వృషభ కటక సింహములను నిలుపుట ఇంకొక పద్ధతి. ఈ స్థానాలను గుర్తించి ఏడుగురు చేతులు కూర్చుకొని పాటలు పాడుతూ ఆయా స్థానాలలో పాదాలుంచుకొని ఎడమపక్క నిలిచినవారు కుడిపక్కకు, కుడిపక్క నిలిచినవారు ఎడమపక్కకు మారుతూ నిలవడం పద్ధతి.

ఆటపాటలను ముగించారు ఆ గొల్లలు.

~~~
~~~

## దుఃఖం

గొల్ల ముదివనిత మాదరి తామాడిన గొల్లల ఆట తర్వాత వైగైనదికి వెళ్ళి నీరాజనమర్పింప తలచి, ఆ నదివైపు వెళుతుండగా, నగరాన జరిగిన సంఘటన విని తొట్రుపడి, వెంటనే వెనుదిరిగి ఇంటికి వచ్చింది. కానీ ఆ దుఃఖవార్తను కన్నగికి చెప్పలేక నిలువగా, అప్పుడు కన్నగి ఇలా అన్నది: ''నా ప్రాణాలకన్న హెచ్చయిన నా ప్రాణనాధుని చూడక నా మనసు కలతబారుతూంది. కొలిమి తిత్తిలాగ నా ఊపిరితిత్తులు ఎగసిపడుతున్నాయి. ఇరుగుపొరుగు చెలులు చెబుతున్న మాటలు ఏదో చెడు జరిగినట్లు అనుభూతి కలిగిస్తున్నాయి. ఎవరో నా నాధుని వంచించినట్లనిపిస్తూంది. కానీ చుట్టుపక్కల చెలులు ఎవరి గురించి మాట్లాడుకొంటున్నారో తెలియరావడం లేదు.'' అప్పుడు 'ఇతడే హరించిన ఆ దొంగ అని చెప్పి రాజభటులు అతని శిరస్సును ఛేదించారట! ' అని ఒక గోపిక అంటుండగా అది విని కన్నగి చివ్వున లేచి, ఉగ్రాతిరేకంతో ఎర్రబారిన కన్నులతో 'ఎక్కడ నా ప్రాణప్రియుడు? ' అని వెక్కి వెక్కి ఏడ్వసాగింది. అంతలో తేరుకొని, ''ఒకవేళ ఈ పాండ్యుని పాపకృత్యం వల్ల నేను నా ప్రియపతిని కోల్పోయినట్లయితే తక్కిన అల్పవ్రతలలాగ గుండెలు పగిలేలాగ ఏడ్చే బేలను కాను నేను. ప్రియపతిని కోల్పోగా అనేక పుణ్యతీర్థాలలో తీర్థమాడి వచ్చి ఏడుస్తూ కూర్చొనే సాధారణ వనితల్లాగ , ధర్మాధికారుల స్థానంలో ఉన్నానని మరిచి ఆ పాండ్యుడు పాపకార్యం చేశాడని తెలియవస్తే , నేనూరుకోను. ఏడుస్తూ కూర్చోను. గొల్లల ఆటకు వచ్చిన వనితలారా, వినండి! ఓ చండభానుడా! కర్మసాక్షియైన నీవు లోకంలో జరిగేటంతటికీ సాక్షివి. నీవే చెప్పు, నా పతి దొంగా?'' అని సూర్యుని నిలదీసి అడిగినప్పుడు, ''కాదు, కాదు నీ పతి దొంగ కాదు, అతడు దొంగ అని నిందించిన ఈ దుష్టనగరం కాలి బూడిదవుతుంది !'' అన్నదొక అశరీరవాణి.

~~~
~~~

## కన్నగి నగర ప్రవేశం

" నీతిలేని ప్రభువు పాలిస్తున్న పట్టణాన వసిస్తున్న అమ్మలారా! అక్కలారా! నా మగడు నా రెండవ అందియ తీసుకొని రాగా, ఆయనకు పట్టిన గతేమి? ఈ అందెతో ఆ అందెను చేర్చి చూడండి! మీకే తెలిసివస్తుంది. నా భర్త చోరుడా? కానే కాడు! ఈ మాపటి వేళ నాకు కలిగిన దుర్గతి చూడండి. నా కాలియందెకు తగిన ధనమివ్వక దొంగ అని నింద మోపి చంపిన మగవారి సత్ప్రేమకు పాత్రులైన వనితలారా! నా ప్రేమధనంతో నా పతిని బ్రతికిస్తాను, చూడండి! అప్పుడతని నోటి వెంట జరిగినది తెలుసుకొందురు గాక! ఒక వేళ అది అసత్యమయితే, నన్ను మీకు తలవంపులు తెచ్చిన దొంగభార్యే అని పిలవండి! ఇది సత్యం!" అని చెప్పి విలపిస్తున్న కన్నగిని చూసి అందరూ కంట నీరు పెట్టుకొన్నారు.

కన్నగి మాటలు పురప్రజలకు చాల కలత కలిగించాయి - ఎప్పుడూ న్యాయంగా, నీతితో పరిపాలించే పాండ్యరాజుకిప్పుడేమయ్యింది ? ఎందుకీనాడు నీతి కోల్పోయి ప్రవర్తించాడు? ఈ రాజ్యానికి పోగాలం వచ్చింది. బంగారపుటందె చేతబట్టి వచ్చిన ఈ కొత్తవేలుపు వల్ల మన నగరానికి ఎటువంటి గతి పట్టబోతూందో కద అని చింతిస్తూ, అన్యాయయుక్తమై అపనింద పాలైన మదురై పురప్రజలు ఆమెను ఆ ఘాతుకం జరిగిన స్థలానికి తీసుకెళ్ళారు. ఆ ఘోరదృశ్యం చూడలేక సూర్యుడు పడమట కొండ వెనుక కుంకాడు. శిరస్సు ఖండించబడివున్న తన పతిని చూసి భోరుమని ఏడుస్తూ కన్నగి అతని ఎద మీద వాలి, ఉదయం అతని అందెనిచ్చి సాగనంపినప్పుడు అతన్ని కౌగిలించుకొని ప్రేమతో ఇచ్చిన పూమాలనిప్పుడు అతని సిగనుంచి తీసి తన సిగలోధరించి, గాయంనుంచి ప్రవహిస్తున్న అతని రక్తంతో తన ఒడలెల్ల తడిసిపోగా, అతని గతి చూసి ఇలా విలపించసాగింది - 'చందనపు పూతతో ఘుమఘుమలాడే నీ ఈ మేను ఇలా దుమ్ములో పడివుండ తగునా? ఈ రాజదండనకు పూర్వ దుష్కృతమే కారణమని ధైర్యంగా చెప్పగలవారున్నారా ఈ నగరిలో? పాండ్యుడు చేసింది దుర్భర పాపమని చెప్పగలవారే లేరా ఈ నగరిలో? పరమ ఛండాలుడైన ప్రభువున్న ఇటువంటి పురంలో పతివ్రతలున్నారా? పతుల కష్టాలు చూసి భరించే పతివ్రతలున్నారా? పెద్దలున్నారా? పరమ ఛండాలుడైన ఈ ప్రభువున్న ఊరిలో దేవుడున్నాడా?

అన్యాయంగా నా పతి వధింపబడ్డ ఈ ఊరిలో దేవుడున్నాడా?' అని పరితపిస్తూ తన భర్త ఎదను ఎదకు హత్తుకోగా, కోవలన్ సజీవుడై, కన్నగి కన్నీరు తుడిచి, 'నాకీ భూమి మీద ఋణం తీరింది' అని చెప్పి స్వర్గానికి వెళ్ళగా, కన్నగి విభ్రాంతి చెంది, 'ఇది మాయా? లేక కలా? లేక దెయ్యమా?' అని తలపోస్తూ, 'నా కినుక (కోపం) శాంతించే వరకు నా పతి వెంట నేను వెళ్ళజాలను. దుష్టుడైన ఈ ప్రభువును చూసి, నిజంగా జరిగిందేమని తెలుసుకొంటాను' అని లేచి ధారగా ప్రవహిస్తున్న తన కన్నీటిని తుడవక, వడివడిగా నడిచి వెళ్ళి రాచనగరు వాకిట నిలిచింది కన్నగి.

~~~

## న్యాయ వచనం

ఆ సమయాన రాజప్రాసాదంలో అవనీశ్వరుని సర్వాలంకారభూషితుని చేసి పేరోలగానికి (నిండుసభకు) తీసుకొని వెళ్ళేందుకు దాసదాసీజనాలు పట్టుపీతాంబరాలు, ఆభరణాలు, పూమాలలు, సుగంధద్రవ్యాలు తీసుకొని వెళుతుండగా, ముత్తైదువలు చిరాయువుగా జీవించమని దీవించ వెంట వెళ్ళగా, అనుంగు చెలికత్తెలు అతని గుణగణాలను పొగడుతూ వెంట వెళ్ళారు.

అప్పుడు నగర ద్వారం వద్దకు చేరిన కన్నగి, అక్కడి ద్వారపాలకులను చూసి, "మతి చెడి, ధర్మం నశించి, నీతి మాలిన కడు దరిద్రుని నగరద్వారాన్ని కాస్తున్న కుంకల్లారా! తన పతిని పోగొట్టుకొన్న ఒకతె తన చేత ఒక అందె పట్టుకొని నగరం వాకిట నిలిచి ఉందని మీ రాజుకు తెలుపండ"ని కోపంతో అనగా, అక్కడి ద్వారపాలకుల్లో ఒకడు వేగంగా సభకు వెళ్ళి, పాండ్యరాజుకు జయం పలికి, వార్తను ఈ విధంగా తెలియజేశాడు ::

"ధర్మమార్గం వీడని పాండ్యనాయకా! బలి ఇవ్వబడ్డ జీవి మొండెం మీద నిలిచి, చేత బల్లెంగొని తాండవమాడే భీకరమూర్తియైన వేల్పుగాదు, సప్తకన్యకల్లో చిన్నదైన ఆ పిడారిగాదు, పార్వతీశుని తాండవింపజేసే రుద్రాణిగాదు, భయానక వనదుర్గ కాదు, మహాకాళిగాదు, కాని ఆ మాతల రూపుగొని, తన పతిని కోల్పోయి కోపోద్రిక్తురాలై, చేత బంగారపుటందె పట్టి ఒక ధీరవనిత నగరపు వాకిట నిలిచివున్నది
~~~

ప్రభూ!''

ప్రభువు వెంటనే ఆమెను పిలుచుకొని రమ్మని ద్వారపాలకుని ఆజ్ఞాపించాడు. ఆ విధంగానే ద్వారపాలకుడు వెళ్ళి కన్నగిని పిలుచుకొని వచ్చి సభలో ప్రభువు ఎదుట నిలిపాడు.

''ఇంతీ! నీవెవరవు? ఏమి కార్యం?'' అని పాండ్యరాజు కన్నగిని ప్రుచ్ఛించగా, అందుకు కన్నగి ఆక్రోశంతో, ''ఇసుమంత కూడ ఎరుక లేని భూపాలా! నీకు బుద్ధి వచ్చేటట్లు చెప్పవలసిన సంగతి ఉంది, విను! దేవతలు విస్మయమొందేటట్లు పావురం కోసమై తన శరీరాన్ని పణంగా ఇచ్చే రాజు, ప్రజలకు న్యాయం చేకూర్చేందుకు తన కుమారునే తేరు కింద తొక్కించేటటువంటి రాజేలే పూంపుహార్ మా ఊరు. ఆ ఊరిలో బహుకీర్తిప్రతిష్టలు గాంచిన మా సార్థవాహుని కుమారుడైన నా భర్త ధన సంపాదనకై అరుదైన నా కాలియందె గొని ఈ ఊరికి వచ్చి దాన్ని అమ్మజూపగా, నీ చేత అధర్మరీతిన వధింపబడ్డాడు. ఆ కోవలుని భార్యను నేను, నా పేరు కన్నగి!'' అనగా, అందుకు పాండ్యరాజు, ''ఓ స్త్రీరత్నమా! చోరునికి మరణదండన విధించడమేవిధాన దుర్దండనమౌను?' అని ఎదురు ప్రశ్న వేయగా, కన్నగి మరింత కోపావేశంతో, ''ఓ వివేకహీనుడైన నరనాధా! నా భర్త తెచ్చిన అందె సాధారణమైన అందె కాదు! దాని జతగా ఉన్న ఈ అందె లోపల అమూల్యమైన మణిమాణ్యాలు, వజ్ర వైఢూర్యాలు ఇమిడివున్నాయి, చూడు!'' అంటూ తన చేతనున్న అందెను బలంగా నేలకు విసిరి కొట్టింది. అది పగిలి అందులోపలినుంచి ఒక కెంపు ఎగిరి వెళ్ళి రాజు ముఖాన్ని తాకింది. అవనీశుని ఛత్రం కింద పడింది, రాజదండం దొర్లిపడి ముక్కలైంది. అదిరిపడ్డ ఱేడు నేల రాలిన మణులను చూసి, ''ఆ కపటి కంసాలి మాటలు విని దుర్దండన విధించిన నేను రాజును కాను! నేనే చోరుడను! ప్రజలను కన్నబిడ్డలుగా ఎంచి కాపాడే పాండ్యరాజుల పరిపాలన నా వలన కలుషితమై, నేటితో అంతమైంది! ఓ మృత్యుదేవతా! వెంటనే వచ్చి నన్ను తీసుకొని పో! అంటూ ధడేల్మని నేల కూలగా, అది చూసి రాణి గుండెలదిరి, పతి పాదాలను తాకుతూ నేలకొరిగింది.

~~~
~~~

## ప్రతిన

"పాండ్యుని దేవి తన భర్తను కోల్పోవ కారణమైన దుష్కర్మురాలను నేను. వన్నెవృక్షాన్ని, బావిని, శివలింగాన్ని తన పాతివ్రత్యానికి సాక్ష్యం చెప్పించిన వణిజ కుమార్తె, అమ్మలక్కలు వేళాకోలానికి 'ఇసుక బొమ్మ నీ భర్త అవుతాడ'ని చెప్పగా నమ్మి సైకతం[21]మీద నిలిచిన పడుచు, కావేరిలో పడి కొట్టుకొని పోయిన భర్తను ఆ సముద్రుని వేడి తిరిగి రప్పించుకొన్న స్వర్ణలత మొదలైన మహాపతివ్రతలు పుట్టిన పూంపుహారు నగరాన పుట్టిన నేనట్టి పేరుగాంచెదను ఈ మదురై నగరాన్ని బూడిద చేసెదను. ఓ మునులారా ! అమరవరులారా ! వినండి నా పంతాన్ని ! నా మనోహరుని అధర్మరీతిన చంపిన ఈ పాండ్యరాజు నగరం మీద కోపంగొన్నదానను. ఇది పాపముగాదు, చూడుము !" అని కన్నగి తన కుడి చేత తన ఎడమ స్తనాన్ని లాగి చేయెత్తి పుర ప్రదక్షిణంగా విసిరివేయగా, అది విలయాగ్నిగా, జేగురు జడలు, తెల్లని కోరలుగ అగ్నిదేవుని రూపందాల్చి కన్నగి ముందు నిలిచి, "ఓ సతీ తిలకమా! ఒక మాట విను. ఈ నగరం నీకు కీడు తలచిన నాడే దహించివేయ ఆజ్ఞ పొందినవాడను. కావున ఇట బ్రతుకవసిన వారెవ్వరో సెలవిమ్మ"నగా, అందుకు కన్నగి, "విప్రులు, ధార్మికులు, వృద్ధులు, పసిబిడ్డలు, పతివ్రతలు వీడి విజృంభించు"మనగా, ఆ విధంగానే విలయతాండవం చేశాడు అగ్నిదేవుడు.

~~~

21 సైకతం = ఇసుకదిబ్బ
~~~

## పురదహనం

కన్నగి ప్రేరణతో అగ్నిదేవుని ప్రతాపం మిన్ను ముట్టింది. నగరదేవతలైన ఇంద్ర, వరుణ, యమ, సోములు తమతమ దేవాలయాలను వదిలి బయటికి వచ్చారు.

అంతకు మునుపు, తనకు రాబోయే ఆపదను తప్పుకోవడానికి ఆ దేవతలకు పాండ్యరాజు ప్రాణబలి ఇచ్చిన సంగతి ఎరుగక రాజగురువు, మంత్రులు, రాజబంధువులు, పండితులు, సేవకులు వచ్చి చిత్తరువుల్లాగ నిలబడగా, సాయుధవీరులు, సారధులు, రధికులు, అశ్వికులు వచ్చి రాజును, రాణిని స్వర్ణసింహాసనం మీద చూసే కుతూహలంతో వచ్చి రాజద్వారం వద్ద నిలిచారు. ముత్యాలకోవలాంటి బ్రహ్మయజ్ఞోపవీతం ధరించి ఆది భూతం, ఎర్రని కాంతులీనే మేనుతో చేత ఛత్ర చామరాలు, ఖడ్గం, ధ్వజం, బల్లెం ధరించి రాజభూతం, బంగారుమేని ఛాయతో సుస్థిర మహిమగలిగి వైశ్యభూతం, నాగలిని ఆయుధంగా ధరించి కాపు భూతం కూడలిలో కలుసుకొని, 'పాండ్యవిభుని ధర్మం తప్పి ఈ పురం కాలి బూడిదవుతుందని మనమింతకు మునుపే ఎరుగుదుం కాబట్టి ఈ సంగతిని తన స్తనంతో ఈ నగరిని కాల్చదలచిన ఆ సతికి తెలుపుదమ'ని ఆ భూతాలు నాలుగు దిక్కుల వెళ్ళగా, తేరువీధులు, అంగళ్ళవీధులు మొదలైన నాల్గు వీధుల్లోని ప్రజలు కలతనొందగా, ధార్మికులు, పండితులున్న వీధులను విడిచి పాపులు, నీచులున్న వీధుల్లో అగ్నిదేవుడు చెలరేగగా, ఆవులు, వాటి దూడలు మంచిబుద్ధిగల గొల్లల వీధికి వెళ్ళి తలదాచుకొన్నాయి ; ఏనుగులు కోట వెనుక వెళ్ళి దాక్కొన్నాయి. పడతులు తమ భర్తలను వీడి, చిన్నారులను, ముసలివాళ్ళను తీసుకొని ఎక్కడికో పారిపోగా, గృహస్థధర్మాన్ని వదలని ఇల్లాండ్రు ప్రియుని కోల్పోయి పాండ్యరాజును తన అందెతో జయించిన సతీమణి తన స్తనంతో చేసిన చేత క్రూరం కాదని అగ్నిదేవుని స్తుతించారు.

సంధ్యాకాలంలో పరిపాటిగా జరిగే పూజలు, హోమాలు, వినిపించే వేదఘోషలు, వెలిగించబడే దీపాలు కానరాకపోగా, తన భర్తను కోల్పోయిన సంతాపంతో వీధుల వెంబడి తిరుగుతూ పరితపిస్తూన్న కన్నగి కానవచ్చింది ఆ పురదేవికి.

~~~
~~~

## పూర్వజన్మ వృత్తాంతం

జడలో చంద్రుని, కుడికాలికి పెండేరం, ఎడమకాలికి అందె ధరించిన నగరదేవత, కన్నగి ఎదుట వచ్చి నిలబడే ధైర్యం లేక, ఆమె వెనుక నిలిచి, “ఓ అన్నులమిన్న ! నీవు తెలుసుకోవలసిన కొరత ఒకటుంది, విను" అనగా, అందుకు కన్నగి, “ముఖం చాటేసి నాతో మాట్లాడుతున్న నీవెవతెవు ? నా దుఃఖానికి పూర్వకారణం తెలుసుకోవలెనేమి ?” అని అడుగగా, ఆ పురదేవత,

“అమ్మా ! నేనీ మదురై పురదేవతను. నీ పతికి కలిగిన ఆపదకు వెనుకనున్న వృత్తాంతం నేనెరుగుదును. మా ప్రభువైన పాండ్యరాజు పూర్వకర్మఫలాన్ని పొందిన వృత్తాంతం విను. విప్రుల (బ్రాహ్మణుల) స్తుతులు తప్ప ప్రజల నిందకు గురికాని మా ప్రభువు దుష్టప్రభువు కాడు. సదా ప్రజల క్షేమం కోసం, రక్షణ కోసం పాటుపడే ధర్మప్రభువు.

"ఇంకొక సంఘటన విను. పావురాన్ని కాపాడేందుకు త్రాసెక్కిన ప్రభువు, ఆవుకు న్యాయం చేసేందుకు కన్న కొడుకునే రథం కింద తోసిన పుహార్ వంశ ప్రభువు ఏలికలో పాడిపంటలతో తులతూగే చోళదేశంలో పరాశరుడనే ఒక బ్రాహ్మణుడుండేవాడు. చేరరాజు దాతృత్వం, చేరదేశపు సిరిసంపదలు విని ఆ రాజు ఆస్థానానికి వెళ్ళి వేదశాస్త్రాలు అమోఘంగా పఠించి, రాజు ప్రశంసలు, అమూల్యమైన బహుమతులు పొంది, తన గ్రామానికి మరలాడు. దారిన తంగాలు అనే ఒక అగ్రహారంలో రాజు విడిది చేసే మంటపంలో దిగి, తన దండ కమండలాలు, మూట కింద పెట్టి, ఆ రాజును చిరంజీవిగా, ఆయురారోగ్యాలతో జీవించమని దీవిస్తూ సేదదీర్చుకోవడానికి కూర్చొన్నాడు. అప్పుడక్కడికి తలిదండ్రులను వీడిన బాలకులు అతని చెంతకు రాగా, ఆ బ్రాహ్మణుడు వారిని చూసి, 'పిల్లలారా ! నాతోబాటు చక్కగా చదివితే ఈ మూట ఇస్తాను' అని చెప్పి పఠనం మొదలు పెట్టగా, దక్షిణామూర్తి అనే బాలుడు తడబడకుండ, స్వరలక్షణాలు తప్పకుండ పరాశరునితోబాటు పలుకగా, ఆతడు చాల సంతసించి, జందెంతోబాటు, వస్త్రాభరణాలు, కడియం మొదలైన కానుకలిచ్చి తన గ్రామానికి తరలి వెళ్ళాడు. దక్షిణామూర్తి తొడిగిన బట్టలు, వేసుకొన్న నగలు చూసి అసూయపడ్డ రక్షకభటులు అతన్ని రాజు ధనమపహరించాడని చెప్పి బంధించి రాజు ముందు నిలిపారు. అదే

సమయాన గుళ్ళలో దీపాలారిపోయి, తలుపు మూతపడగా, రాజు ఏదో తప్పు జరిగిందని గ్రహించి భటులను జరిగింది వివరించమని అజ్ఞాపించాడు. అప్పుడు వారు నిజంగా జరిగింది చెప్పగా, రాజు దక్షిణామూర్తిని క్షమాపణ కోరి, తగిన రీతిగా గౌరవించి, బహుమతులిచ్చి పంపిన న్యాయమూర్తి ఈ పాండ్యరాజు.

"అటువంటి పాండ్యరాజు ఒకనాడు నీతి తప్పుతాడని, ఈ మదురై నరగం కటకమాస, కృష్ణపక్ష శుక్రవారం దగ్ధమవుతుందని అశరీరవాక్కు వినిపించింది. కళింగదేశంలో కపిలపు రాకుమారులిద్దరి మధ్య విరోధ్గభావంకలిగి, వారిలో ఒక రాకుమారుడు సంగముడు ఆ దేశం వదిలి, ఇతర దేశాల్లో చాల ధనం సంపాదించి సింహపురికి వచ్చి, తన భార్యతో అంగళ్ళ వీధిలో విడిది చేశాడు. ఆ సింహపురి రాజుకు పాలనలో కుడిచేయిగా మసలే భరతుడనేవాడు సంగముని సంపద చూసి ఓర్వలేక, అతడు శత్రువుల గూఢచారి అని చెప్పి రాజును నమ్మించి చంపించాడు. ఆ విధంగా చంపించినవాడు నీ భర్త కోవలన్ తల్లీ! ఆ సంగముని భార్య ఆ సింహపురి వీధుల్లో ఎలుగెత్తి ఏడుస్తూ ఇచ్చిన శాపఫలమే ఇప్పుడు మీరనుభవింపవలసి వచ్చింది అన్నులమిన్న ! దుష్కృత ఫలం వెన్నంటుతున్నప్పుడు సుకృతఫలం ఆదుకోదు. నేటికి పదునాల్గవ దినం నీ భర్త మానవరూపంలో కానవస్తాడు" అని నగరదేవత పూర్వజన్మఫలం వివరించి చెప్పి వెళ్ళిన తర్వాత, కన్నగి నా హృదయేశుని చూడనంతవరకు నాకు నెమ్మది లేదని దుర్గ గుడికి వెళ్ళి తూర్పు వాకిలి దగ్గర తన చేతిగాజులు పగులగొట్టి, పడమటి వాకిలి గుండా గుడి దాటి, ఎటు వెళ్ళాలో దిక్కు తోచక కొండలు గుట్టలెక్కి దిగుతూ చివరికి తిరుచ్చెంగూరు అనే ఊరు పక్కనుక్క గుట్టనెక్కి పదునాల్గు రోజులు తన భర్తను చూడ వేచింది. ఆ పదునాల్గవ దినం ఇంద్రాది దేవతలు వచ్చి కోవలుని ఆమెకు చూపి, వారి వాహనంలో కన్నగిని దేవలోకానికి తీసుకొని వెళ్ళారు.

-: ఇంతటితో మదురై కాండమ్ సమాప్తం :-

# అందెల కథ

## మూడవ భాగం

### *వంజి కాండమ్*

## కొండవారి ఆట

కొండజాతుల వారు తాము చూసింది ఇలా చెప్పుకొచ్చారు:

“కొండలు, గుట్టలు ఎక్కి, దిగి, చిలుకలను తరిమి, సెలయేళ్ళలో మునిగి వచ్చిన మాకు, ఒక వేగి చెట్టు కింద ఒక స్తనం లేక తీవ్రంగా గాయపడి శ్రీవల్లిలాగ నిల్చొనివున్న ఒక వనిత కానరాగా మా గుండెలదిరాయి. 'అమ్మా! తామెవరు?' అని మేము చేతులు జోడించి అడుగగా, అందుకా తల్లి, 'దుష్కర్మఫలం చేత నా భర్తను ఈ పాండ్యదేశంలో కోల్పోయి, అందుకు ప్రతిగా ఈ మదురై నగరం కాలి నశించాలని శపించిన పాపాల కుప్పను నేను' అని బదులిచ్చింది. అప్పుడు పూలవాన కురిపిస్తూ దేవలోకంనుంచి దేవతలు ఆమె పతితోబాటు వచ్చి ఆమెను కూడ దేవలోకానికి వారి వాహనంలో తీసుకెళ్ళారు. అది చూసి మేమందరం ఆ తల్లే మా వేటపల్లికి వేలుపని ఎంచి, ఆమెకు గుడి కట్టాలని ఎంచాము. ఆటపాటలతో, ముగ్గులతో వేడుకలు చేసుకొంటూ ఆమెకు కోవెల కట్టాము. అప్పటినుంచి కొరవకన్యల పెళ్ళిళ్ళకు కన్నగి వేలుపయ్యె. చేరభూపాలుడు కూడ మాకు తోడు నిలిచాడు.”

~~~
~~~

## పర్వతదర్శనం

కడలినే కోటగాదాల్చిన కదంబ వృక్షం నుంచి మలిచిన ధనుస్సుతో ఆ దేవతలే అచ్చెరువొందేటట్లు హిమగిరి మీద తన విజయపతాకాన్ని నాటిన చేర రాజు చెంగుట్టువుడు తన మేడలో తన యువరాజలక్ష్మి ఇలంగోవేణ్మాల్‌తో కూర్చొని మాట్లాడుతున్నప్పుడు, ఆ వంజిపురం దాటి అవతల ఉన్న గిరివనాలు, సెలయేళ్ళు చూసి ఆనందింపదలచి, తన దేవితోను, పరిచారికలతోను బయల్దేరాడు చేరభూపాలుడు. దారిన అనేక మడుగులు, కొలనులు, పూదోటలు, మండపాలు, నాట్య, నాటకశాలలు, సౌధాలు చూస్తూ వెళ్ళారు. నగరద్వారం దాటి పొన్న చెట్ల వెంబడి నడిచి వెళుతుండగా, దూరాన కొరవల ఆటపాటలు, కొట్టిలు దంచే కొరవల అరుపులు, డప్పుల మోతలు, పులులతో పోరాడే ఏనుగుల ఘీంకారాలు, వాటిని పట్టబోతున్న మావటుల అరుపులు వినిపించగా, రాజపరివారం కాస్త ఆగారు. అప్పుడా కొండ కొరవలు ఏనుగు దంతాలు, చందనపు చెక్కలు, చామరాలు, తేనెకడవలు, రకరకాల పళ్ళు కానుకలుగా తీసుకొని వచ్చి నగరం వాకిట రాజుకు సమర్పించి, 'ప్రభూ! ఏడేడు తరాలు మీకు లోబడి ఉంటాము, తమ రాజనీతి చిరస్థాయిగా విరాజిల్లాలి!' అని ఘోషించి, 'ప్రభూ! అడవిలో ఒక గుట్ట మీద వేగి చెట్టు కింద ఒక స్తనం కోల్పోయి, మిక్కిలి దుఃఖంతో ఒక వనిత నిలిచివుండగా, ఆకాశంనుంచి దేవతలు ఆమె పతితోబాటు వచ్చి దిగి, పూలవాన కురిపిస్తూ, ఆమెను కూడ దివికి తీసుకొని వెళ్ళడం చూశాము. ఆమె ఏ దేశీయురాలో? ఎవరి తనయో? ఎవని పత్నియో? ఇటువంటి సంఘటన మేమెప్పుడూ కని, వి ఎరుగము ప్రభూ!' అని విన్నవించుకొన్నారు.

అది విని చేరరాజు తనతోబాటున్న శాస్త్ర విజ్ఞానియైన తమిళ విద్వాంసుని చూసి ఎరుక చెప్పమనగా, ఆయన తన దీర్ఘదృష్టితో జరిగినది తెలుసుకొని, కన్నగి వృత్తాంతాన్ని రాజుకు క్లుప్తంగా వివరించాడు. అటు పిమ్మట కన్నగి తన ప్రాణనాధుని వెదుకుతూ తన దేశానికి వెళ్ళక ఇటు వచ్చిందని, పూర్వాపరాలు వివరించాడు.

అదంతా విని తెలుసుకొన్న చేర రాజు విద్వాంసునికి కృతజ్ఞత తెలిపి, తన దేవిని చూసి, ఇలా అన్నాడు: 'దేవీ! చూశావా, పాతివ్రత్య మహిమ! పాండ్యరాజు దుష్పరిపాలనకు తగిన ఫలితాన్ని వెంటనే అనుభవించాడు." అందుకు ప్రభుదేవి ఇలా

ఉత్తరమిచ్చింది:"అవును. తన భర్తను కోల్పోయిన దుఃఖం ఓర్వలేక ఆ పురాన్నే తన స్తనంతో కాల్చిన ఆ దేవిని పూజించడం చాల భవ్యం. హిమగిరి మీద మన పతాకం నాటిన చోటినుంచి శిలను తెప్పించి ఆ దేవి ప్రతిమను చెక్కించి గంగా కావేరి నదీజలాలతో తీర్థాభిషేకం చేయించి ప్రతిష్ట చేయవలె."

అది విని రాజు చాల సంతోషించి, తన మంత్రులకు, సేనాపతులకు ప్రయాణానికి సన్నాహాలు చేయమని పురమాయించాడు. ఆ విధంగానే చేరసైనికులు సకల సన్నాహాలతో, విందుభోజనంతో ప్రయాణం మొదలు పెట్టి, వంజి పురద్వారం దాటి, జయజయ ధ్వానాలతో, చేరరాజు కీర్తిని, కళింగులు, కొంగులు, కొంకణుల మీద సాధించిన విజయాలను పొగడుతూ, మార్గమధ్యంలో ఎదురయ్యే రాజులందరూ చేరరాజు చేపట్టిన పుణ్యకార్యానికి సహాయం చేస్తారని ఘోషిస్తూ హిమగిరి నుంచి శిలను తెచ్చే మహాప్రస్థానాన్ని ప్రారంభించారు. మార్గంలో ఎదురయ్యే రాజులకు చూపేందుకు విల్లు, పులి, చేప చిహ్నాలు ముద్రించిన లేఖలను దళపతులకు అందించాడు చేరభూపాలుడు. అప్పటికే ఈ ప్రయాణ సన్నాహాల గురించి వేగుల మూలంగా తెలుసుకొన్న ఉత్తర, దక్షిణ దేశాలలో ఉన్న మిత్రరాజులు చేరభూపాలునికి అనేక కప్పాలు, కానుకలు పంపించారు. వాటిని నగరద్వారం వద్ద స్వీకరించి, జయభేరి మోగించాడు చేరవిభుడు.

~~~
~~~

## శిల కోసం ప్రయాణం

చేరభూపాలుడు చెంగుట్టువుడు ప్రస్థాన (ప్రయాణ) భేరి విన్న తర్వాత సభకు తిరిగి వచ్చి, సింహాసనమధిష్టించి , నిండుసభలోనున్న మంత్రులను, సేనాపతులను, శాస్త్రజ్ఞులను, హితులను చూసి ఇలా భాషించాడు: ''బహుపుణ్యతీర్థ సేవలు చేయగోరి హిమవత్పర్వత దేశాలనుంచి వచ్చిన మునులు పలికిన వాక్కులు తృప్తి లేని మనుగడ సాగించే రాజుల మాటలు. అవి మావంటి భూపాలురకు గౌరవభంగం - ఉత్తరదేశ నృపోత్తముల చేత మోయించి తేక, శిలను మన ప్రజల చేత అతిక్రూరంగా తెప్పించబోతున్నానని వారి ఉవాచ!''.

అది విని పురోహితుడు, ''ఓ కరుణామయా ! ఆ మాటలు నీతి తప్పిన చోళ, పాండ్యరాజులనుద్దేశించి ఆ ఉత్తదేశీయులన్న మాటలు, మిమ్ము గురించి కావు, కోపము వలదు! '' అని సమాధానపరిచాడు .

ఆ తర్వాత గ్రహస్థితిగతులు, పంచాంగ విషయాలు కూక్షణ్ణంగా తెలిసిన నైమిత్తకుడు లేచి, ''నరేంద్ర చంద్రా! చిర సుఖీభవ! పుడమి రాజులెల్లరు తమ పాదపద్మముల సేవింపదగిన ముహూర్తమిది. తలపెట్టిన దిశకు ఇప్పుడు పయనం చేయడం ఉత్తమమ"ని చెప్పగా, చేరవిభుడు, ''మన కత్తి గొడుగు ఉత్తదిశగా నడచుగాక!'' అంటూ ప్రస్థానభేరి భూమి అదిరేటట్లు మోగించాడు. వెంటనే మంత్రులు, దళపతులు, విప్రులు, పురోహితులు, ధర్మశాస్త్రజ్ఞులు జయజయ ధ్వానాలు చేయగా, ఏనుగు మీద తన ఛత్రాన్ని నిలిపి తన సేనను శిలను తెచ్చేందుకు సాగనంపాడు రాజు.

సాయుధవీరులు, దళపతులు, అశ్వవీరులు, సేనాపతులతో కూడిన ఆ సేన సముద్రతీరం వెంబడి ముందుకు సాగింది. దారి వెంబడి, కర్ణాటక, కొంకణ తీరప్రజలు చేరరాజు సేనను స్వాగతించి వారి రాజు చేపట్టిన కార్యాన్ని పొగడారు.

కొన్నాళ్ళకు చేర భూపాలుడు నిండుకొలువు దీరివున్న రోజు, సంజయుడనే మేటి దూత తన వేయిమంది అనుచరులతోను, వంద నాట్యలత్తెలతోను, పదివేల అశ్వాలు, అనేక సరుకులు నింపిన ఇరవైవేల బండ్లతోను వచ్చి వాకిట నిలిచివున్నాడని ద్వారపాలకులు వచ్చి చెప్పగా, ఆ దూతలను సభలోకి ప్రవేశపెట్టమని ఆదేశించాడు

చేరరాజు.

సంజయుడప్పుడు సభలోకి వచ్చి రాజును స్తుతించి ఇలా చెప్పుకొచ్చాడు: "ప్రభూ! నిపుణులనేకులతో మీ పరివారం శీతపర్వతం నుంచి శిలను తెచ్చేందుకు వెళుతున్నారని విన్నాము. మేమే ఆ శీతాద్రినుంచి తగిన రాయిని ఎంచుకొని హిమజలపాతంలో జలస్థాపన చేసి ఇక్కడికి తెచ్చేవారము. కానీ దారిలో ఒక భీకర నర పాలుడు మమ్ములనడ్డగించి, కండకావరంతో నోటికొచ్చినట్లు వదరసాగాడు. మేమతన్ని తప్పించుకొని వేగంగా వచ్చి మీకీ వార్తను తెలియజేస్తున్నాము. ప్రభూ! వెంటనే పెద్దసైన్యంతో వెళ్ళి వాడికి బుద్ధి చెప్పండి!"

అది విని చేరభూపాలుడు యుద్ధానికి సకల సన్నాహాలు పూర్తి చేసుకొని ఉత్తరదిశగా బయల్దేరాడు.

మధ్యరాజ్యంలో శాతకర్ణుల ఆతిథ్యం స్వీకరించి, వారమర్చిన ఓడలెక్కి నదులను దాటి ఉత్తరదిశగా పయనించి అనువైన చోట తన సైన్యంతో విడిది చేశాడు. అది తెలుసుకొన్న చిత్రుడు, ఉత్తరుడు, విచిత్రుడు, సింహుడు, భైరవుడు, శ్వేతుడనే క్షాత్రవీరులు ద్రవిడుల యుద్ధసామర్థ్యం చూద్దామని చేరరాజు సైన్యం మీద దాడి చేశారు. అప్పుడు చేరరాజు ద్రవిడసైన్యం - రథ, గజ, తురగ పదాతి దళాలు, విలుకాండ్రు, బల్లెపు వీరులు తమ యుద్ధవిద్యానైపుణ్యాన్ని ప్రదర్శించి అరివీరులను చీల్చిచెండాడారు. విజయం చేరభూపాలుని వశమైంది. నాల్కఁణచుకోలేని కనకుని, విజయుని కండకావరం అణిగింది. విజయం పొందిన చేర వీరులు పూర్వ కదన విజయంతో[22]ఉత్తర కదన విజయంతో ముగించారు.

చేరరాజు ఆ తర్వాత హిమవత్పర్వతానికి వెళ్ళి పత్ని దేవత శిల్పానికి తగిన శిలను ఎంచుకొన్నాడు.

~~~

22 పూర్వకదన విజయం (మున్‌తేర్ కురవై) తేరు ముందర భూతప్రేతాలు చేసే నర్తనం, గెలుపొందిన వీరులు చేసే నృత్యం. ఉత్తర కదన విజయం (పిన్‌తేర్ కురవై) తేరు వెనక ఆడే ఆట.
~~~

## జలస్థాపనం

కొలిచే భక్తులను చల్లగ చూసే పత్నిదేవత విగ్రహాన్ని చెక్కించి, ద్రవిడవీరుల పరాక్రమ శక్తులు తెలియక ఎదిరించి ఓడిన కనక విజయుల తలల మీదికెక్కించి, పదునెనిమిది ఏండ్లు, దినములుగాక[23]పద్దెనిమిది ఘడియల్లో ముగిసె కద అని ప్రజలు చేరభూపాలుని పరాక్రమాన్ని, యుద్ధసామర్థ్యాన్ని వేనోళ్ళ పొగడగా, చేరరాజు తన సేనతో గంగానదీతీరం చేరి, దివిజ వంద్యురాలైన పత్నిదేవత విగ్రహాన్ని భక్తితోను, విధివిధానాలతో గంగాజలంలో ఉంచాడు.

అక్కడి రాజులు మందిరాలు, మణి మంటపాలు, తల్పగృహాలు, పూలతోటలతో వసతులు సమకూర్చగా, చేరరాజు తన సేనతో అక్కడ విడిది చేశాడు.

క్షతగాత్రులైన తన వీరులకు తగిన సేవలు చేయించి, అనేక బహుమతులిచ్చి, వందిమాగధుల స్తుతులు వింటూ అమితానందంతో కూర్చొని ఉన్నాడు చేరభూపాలుడు.

అప్పుడు మాడలుడనే విప్రుడు సభలో ప్రవేశించి, చేరభూపాలున్ని స్తుతించి, "ప్రభూ! మాధవి పాడిన మాధవ సమయ వన గీత మహిమ వల్ల మీరీ కనక విజయుల తలలొగ్గింపగలిగారు" అన్నప్పుడు, రాజు అచ్చెరువొంది, "శాత్రవులెరుగని ఆ వాక్యానికి అర్థం వివరింప"మని అడిగాడు.

అందుకు మాడలుడు ఇలా వివరమిచ్చాడు:"మానవనాథా! చల్లని వనంలో, సముద్రతీరాన జలకాలాడుతూ మాధవి ఆలపించిన గీతాలు వింటున్న కోవలన్ ఉన్నట్లుండి, తన పూర్వ కర్మల కారణంగా, మాధవిని విడిచి, తన సతి కన్నగితో మదురై నగరానికేతెంచి, అక్కడ వోగాలము దాపురించిన పాండ్యరాజు మూలంగా మరణదండన విధించబడి మరణించగా, అతని ఇంతి నీ నాట ప్రవేశించగా, ఆమె మహిమ వల్ల ఇప్పుడు నీవీ ఉత్తర దేశ విభుల కిరీటాలను తలదన్నావు. ఇక నే వచ్చిన కారణం విను.

"హిమపర్వతం దర్శించిన పిమ్మట వెనుదిరిగి, మదురైకి వచ్చిన నేను కన్నగి తన అందియతో పాండ్యరాజును కడతేర్చెనన్న వార్త విని అందు గురించి విచారిస్తుండగా,

---

23 దేవాసుర యుద్ధం 18 ఏండ్లు, రామ రావణాసుర యుద్ధం 18 నెలలు, కురుక్షేత్ర యుద్ధం 18 రోజులు, చెంగుట్టువుని యుద్ధం 18 ఘడియం మాత్రం

గొల్లవనిత మాదరి నన్ను కలిసి, కోవలన్ దోషి కాడు, ఇది ప్రభువు చేసిన దోషమని, కోవలుని, అతని పడతిని కాపాడలేకపోయానన్న దుఃఖంతో నదిలో మునిగి స్వర్గం చేరింది. తపస్విని కౌంతి వీరిద్దరు పూర్వజన్మ కర్మల ఫలంగా ఇక్కడికి నాతో వచ్చి ఈ దుర్గతి పాలయ్యారు కద అన్న వేదనతో ప్రాయోపవేశం చేసి అసువులు బాసింది. మదురైకి మూడిన కీడు పూర్తిగా తెలుసుకొని, పూంపుహార్ నగరానికి వెళ్ళి అక్కడి నాగరికులకు జరిగినదంతా చెప్పాను. తన కోడలికి, కొడుకుకు కలిగిన దుస్థితి తెలిసి కోవలుని తండ్రి అలవిగాని దుఃఖంతో తన సంపదనంతా దానం చేసి, బౌద్ధచైత్యానికి వెళ్ళి సన్యాసం పుచ్చుకొన్నాడు. ఆ దుఃఖం తట్టుకోలేక అతని పత్ని ప్రాణత్యాగం చేసింది. కన్నగి తండ్రి తన కుమార్తెకు పట్టిన గతి తెలిసి, అమితమైన చింతతో ఆశీవక శ్రమణుల సమక్షంలో దానాలు చేసి సర్వ పరిత్యాగం చేసి, సన్యాసి అయ్యాడు. అతని పత్ని, కన్నగి తల్లి, అమిత దుఃఖంతో జీవితాన్నే పరిత్యజించింది. ఇదంతా విన్న మాధవి తన గాణిక్యవృత్తి[24]వల్లనే కద లోకంలో ఇటువంటి దుర్ఘటనలు సంభవిస్తున్నాయి అనియెంచి తన నగలన్నీ దానం చేసి సన్యాసం పుచ్చుకొన్నది. ఇదంతా తెలిసి, ఆ దుఃఖభారాన్ని గంగలో మునిగి దించుకోవాలని ఇటుగా వచ్చాను."

అదంతా విని చేరభూపాలుడు అస్తమిస్తున్న సూర్యుని చూస్తూ దీర్ఘాలోచనలో మునిగాడు. అటు పిమ్మట తన మరిదియైన చోళుడు పరిపాలిస్తున్న చోళ రాజ్యంలో అతని తొమ్మండుగురు దాయాదులతని మీద తిరుగుబాటు చేసినా కూడ, చేరభూపాలుని సహాయం వల్ల ఎటువంటి భయం లేకుండ రాజ్యపాలన చేస్తున్నాడని, కావేరి పంటలతో చోళరాజ్యం సుభిక్షంగా ఉందని తెలుసుకొని సంతసించి, మాడలునికి ఏబై తులాల బంగారు బహుమానంగా ఇచ్చి పంపాడు.

ఆ తర్వాత యుద్ధంలో వీరోచితంగా పోరాడి ప్రాణాలు దక్కించుకొన్న రాకుమారులతోను, అప్సరసల వంటి నాట్యకత్తెలతోను, ఎట్టి రాజులనైన ఎదిరించి నిలువగల యుద్ధసమర్థులైన దూతలతోను ద్రవిడ రాజుల పరాక్రమం తెలియక ఎదిరించి ఓడిన కనక విజయులను చోళాది విభులకు చూపే వేడుకతో ముందుగా పంపించాడు.

---

24 వేశ్యావృత్తి

ఆ సమయాన వంజిపురంలో చేరభూపాలుని రాణి తన శయనాగారంలో నిద్ర పట్టక పచార్లు చేస్తుండగా, ఆమె దాదులు వచ్చి ఉత్తరదేశ రాజులను ఓడించి నీ భర్త తిరిగి వస్తున్నాడన్న శుభవార్తను ఆమెకు తెలియజేశారు.

ఆ శుభవార్త తెలుసుకొన్న చేరనాడు ప్రజలు సంబరంతో వేడుకలు జరుపుకోసాగారు. ఆ సంబరాల నడుమ చేరభూపాలుడు వంజినగరంలో ప్రవేశించాడు.

~~~
~~~

## విగ్రహప్రతిష్ఠ

ఉత్తరదేశం నుంచి విజయుడై వంజిపురానికి తిరిగివచ్చిన చేరభూపాలునికి పురప్రజలు ఘనస్వాగతమిచ్చారు. బంగారు జలతారు పనిచేసివున్న పెద్ద గొడుగు పట్టి ఊరేగింపుగా తీసుకొని వెళుతుండగా, పురస్త్రీలు పూలవాన కురిపిస్తుండగా, పలువురు రాజుకు ప్రణామం చేయసాగారు. చేరరాజు వెంట సమరంలో వీరోచితంగా పోరాడి గెలిచిన ద్రవిడ వీరరత్నాలు వచ్చారు.

ఆ వీరరత్నాలు వారికి స్వాగతం పలుకుతున్న యువతులతో సరససల్లాపాలాడుతూ ముందుకు సాగారు.

ఆ సాయంసమయం, తన పరివారం, సైన్యం తన వెంట వస్తుండగా, తన కాంతితో చీకటిని పారద్రోలే చంద్రునిలాగ, భూమధ్యంలో మేరువులాగ ప్రకాశించాడు చేరవరుడు.

చేరభూపాలుని దేవి [25]వేణమ్మ పురమధ్యంలోవున్న తమ స్వర్ణప్రాసాదంలో, రాజును స్వాగితించేందుకు సుగంధద్రవ్యాలతోను, సంగీతవాయిద్యాలతోను అన్ని సన్నాహాలు పూర్తి చేసి సిద్ధంగా ఉంది. రాజు ఏతెంచి చంద్రశాలలో హంసతూలికాతల్పం మీద తన దేవితో ఆసీనుడైనాడు.

[26]శాక్యుడు భద్రతాండవం, విప్రతాండవం చేసి, రాజును దీవించి వెళ్లిన తర్వాత ద్వారపాలకుడు మాడలుని ప్రవేశపెట్టాడు.

మాడలుడు చేరరాజును చూసి, "రాజవరేంద్రా! శాంతంగా విను. చోళుని తొమ్మండుగురు దాయాదులకు బుద్ధి చెప్పి, అటుపిమ్మట, 'ఇడుంబిల్' అనే గ్రామంలో సేనతో విడిది చేసి, ఓడలను సిద్ధం చేసుకొని, ఉత్తరదేశ రాజులను గంగానదీతీరాన గెలిచిన రాజరాజా! నీతిబాహ్యులయిన మానవేశ్వరుల మీది నీ కినుక అణగారుగాక! నీ ఓరిమి హెచ్చుగుగాక! లోకరక్షణ బాధ్యతగా తీసుకొని ఏబదియేళ్ళ వయసు దాటిన పిమ్మట కూడ ఆహవక్రతువులు (యజ్ఞకార్యాలు) చేయనాశించుచుంటివి. హిమగిరి

---

25 వేణమ్మ = వేణ్‌మాల్ (తమిళం)

26 కూత్తచాక్క్యైయన్

వరకు నీ కీర్తిప్రతిష్ఠలు విస్తరింపజేసిన నీవు, దేహమస్థిరమని తెలిసిన జ్ఞానివి! కలిమి నిల్వనిదని తమిళనృపులను ప్రతిఘటించు లోభులకు తెలియజేసితివి కద! పరువము (యవ్వనము) స్థిరము కాదన్న జ్ఞానుల మాటకు భాష్యము కావలయునా ప్రాజ్ఞవరేణ్యా! నీవు చేబూనిన ధర్మపరిపాలన వర్ధిల్లుగాక!" అని దీవించి ముగించాడు.

అది విన్న చేరభూపాలుడు సంతసించి శాంతి ఉత్సవాలు జరిపే ఉద్దేశంతో చెరపట్టిన ఆర్యరాజులను చెర విడిపించి, వంజిపురం అవతల ఒక అగడ్త కంచెగా ఉన్న మందిరంలో వారికందరికి విడిది ఏర్పాటు చేశాడు.

మరునాడు పెద్ద యజ్ఞం జరిపి, ఆర్యరాజులకు విందు భోజనం ఏర్పాటు చేసి, చెరసాలలో ఉన్నవారందరిని విడుదల చేసేందుకు మంత్రులను ఆజ్ఞాపించాడు. అలాగే ఈ సంవత్సరం కాపులు కప్పం కట్టనవసరం లేదని కాపుల కప్పం రాసే గణకులకు తెలియజేశాడు. అటు తర్వాత బలవంతులైన రాజులు నీతి తప్పితే జరిగే పరిణామాలను కన్నగి కథ మూలంగా ఉత్తరదేశ రాజులకు విశదపరిచి, ఈ చేరనాడులో ప్రవేశించి, సర్జక వృక్షం (వేగి చెట్టు) కింద చల్లబడ్డ కన్నగికి శిల్పశాస్త్రజ్ఞులు మలిచిన కన్నగి ప్రతిమను పత్ని దేవాలయంలో శాస్త్రోక్తంగా ప్రతిష్టించి, ఆ దేవాలయంలో నిత్యోత్సవాలు, నిత్యహోమాలు, నిత్యదానాలు సంతృప్తిగా జరగాలని రాజశాసనం విధించి రాజిల్లాడు చెంగుట్టువుడనే ఆ చేరభూపాలుడు.

~~~
~~~

# స్తుతి

కన్నగి వృత్తాంతం, చేరభూపాలుడైన ప్రతాపసూర్యునికి, చోళరాకుమారికి పుట్టి చేరరాజ్యాన్ని ధర్మపరిపాలన చేస్తున్న చెంగుట్టువుని ఉత్తరదేశయాత్ర, ఆర్యరాజులను ఓడించి హిమవత్పర్వతం నుంచి కన్నగి పత్ని దేవత శిల్పాన్ని చెక్కి ప్రతిష్ఠించేందుకు శిలను ఆ ఆర్యరాజుల చేతనే మోయించి తెప్పించడం, విగ్రహప్రతిష్ఠ, ఉత్సవాలు ముగిసిన తర్వాత, చేరరాజు చెంగుట్టువుడు నిండుసభలో సామంతరాజులు చెల్లించిన కప్పం వివరాలు వింటున్నప్పుడు, కన్నగి వృత్తాంతం, మహాసార్థవాహుడు సన్యసించడం, అది తాళలేక అతని పత్ని మరణించడం మాడలుని మూలంగా విన్న దేవంతి, దాది - తామే స్వయంగా మదురైకి వెళ్ళి విషయాలు తెలుసుకోవాలని నిశ్చయించుకొని అక్కడికి వెళ్ళి కన్నగి స్తనజాగ్నితో దహించబడ్డ మదురైని చూసి, అటు పిమ్మట తనకు ఒప్పజెప్పబడ్డ కన్నగిని కోల్పోయి అసువులు బాసిన మాదరి కూతురైన తపస్వినితో కొండకొమ్ముకెక్కి పత్నిదేవతను దర్శించుకొని వచ్చి - చెంగుట్టువునకు తమ కథను ఇలా చెప్పుకొచ్చారు:

**దేవంతి :** ద్రవిడ రాజత్రయార్చిత ప్రథిత దేవి వల్ల హిమవత్పర్వతాన పుట్టి గంగలో మునిగి వచ్చిన చెలిని, చోళనాటి పైడి ప్రతిమను నేను.

**దాది :** వారకాంత మాధవి మీద రోతగొనక తన పతినే దైవంగా భావించి అతని వెంట వెళ్ళిన కన్నగి దాదిని నేను, మా పుగారు బంగరు బొమ్మకు ఉపమాతను.

ఆ తర్వాత కన్నగి వృత్తాంతాన్ని, తాము చూసిన సంఘటనలను రాజుకు వివరించారు.

అది విని వంజి చెలులు, పురకాంతలు కన్నగిని తమ దేవతగా అంగీకరించి స్తుతించారు.

అటు పిమ్మట ధర్మపరిపాలకులైన చేరభూపాలుని, చోళుని వేనోళ్ళ పొగిడారు.

బంతియాట, ఉయ్యాలాట, దంపుడుపాటల్లో చెంగుట్టువుని చేర్చి పొగడుతూ సంతసించారు.

~~~
~~~

## వరదానం

పత్నిదేవత అక్కడ ప్రత్యక్షమై, అదృశ్యమైన పిదప, చేరరాజు దేవంతినుద్దేశించి, "దేవీ, నీవు పలికిన మణిమేఖల అనే అతివ ఎవ్వరు? దయచేసి ఆమె కథ నాకు తెలియజేయుమని " వేడగా, దేవంతి చేరభూపలుని దీవించి, మణిమేఖల సన్యాస వృత్తాంతాన్ని ఇలా వివరించింది:

"మణిమేఖల అయిదు జడలల్లే ప్రాయం వచ్చి, చక్కని అంగసౌష్టవంతో పెరిగి పెద్దదవుతూ వచ్చింది. కానీ ఆ పిల్లకు ఎంత ప్రయత్నించినా కూడ అభినయ విద్య అబ్బలేదు. అంతేగాక ఉత్తమ కులజుల చెంతకు చేరలేకపోయింది. విచారంతో తల్లి మాధవి[27]చెంతకు వెళ్ళి కారణమడిగింది.

అది విన్న మాధవి పేలవంగా నవ్వి, మణిమేఖల సౌందర్యం ఇతరుల మీద విచిత్ర ప్రభావం కలిగిస్తూందని, నిజానికి చాలమందికి ఆమె అందచందాలు సన్యాసం పుచ్చుకొనే ఆలోచన కలిగిస్తున్నాయని వివరించింది,

అదలా ఉండగా, కొండ మీద కన్నగి గుడి ముందున్న కొలనులో మునక వేసిన వారికి తమ పాపాలన్నీ తొలగిపోవడమేగాక, పూర్వజన్మ వృత్తాంతాలు గుర్తుకొస్తున్నాయట !

చేరరాజు చెంగుట్టువుడు ఆ పత్నిదేవతకు నిత్యార్చనలు జరిగేటట్లు చేయగా, ఆ దేవత చల్లని చూపులతో ప్రజలు ధర్మమార్గంలో పయనిస్తూ ఆనందంగా జీవించారు.

**ఇంతటితో అందెల కథ**

**-: సంపూర్ణం :-**

---

27 మణిమేఖల మాధవి, కోవలునకు పుట్టిన బిడ్డ